
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

సోమవారం 19 ఫిబ్రవరి 2024





ప్రధాన పైప్ లైనుకు మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

డై..యేరియా

- నాలుగుకు చేరిన మృతులు
- గుంటూరులో అదుపులోకి రాని వైనం
- అడుగడుగునా తాగునీటి పైపులకు లీకులు
- ఇప్పటికీ మురుగునీటి డ్రెయిన్లలోనే నీటిపైపులైన్లు

తుప్పుపట్టి లీకులతో నిండి.. మురుగు డ్రెయిన్లలో తాగు నీటి పైపులు.. ఆ పైపుల ద్వారానే సరఫరా అవుతున్న తాగునీరు.. తరచూ ఆ నీరు కలుషితమై రోగాల బారిన ప్రజలు.. ఇదీ నగరంలో తాగునీటి సరఫరా వ్యవస్థ పరిస్థితి. రెండువారాలుగా నగరంలో డయేరియా ప్రబలి పలువురు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్తతకు గురయ్యారు. ఇప్పటికి నలుగురు మృతి చెందారు. అయినా అధికారుల్లో చలనం లేదు. డయేరియా వెలుగు చూసినప్పటి నుంచి సమస్యను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు కాని పరిష్కారంపై దృష్టి సారించడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. రోజురోజుకు డయేరియా ప్రభావిత ప్రాంతాలు విస్తరిస్తున్నా.. అధికారులు పట్టీపట్టనట్లుగా ఉంటున్నారు. రెండు వారాలుగా డయేరియాను నియత్రించడంలో నగర పాలక సంస్థ విఫలమైంది. ఇంతా జరుగుతున్నా, జిల్లా యంత్రాంగం అతిసార నియంత్రణలో మొద్దునిద్రలో ఉందనే విమర్శలు వస్తున్నాయి. డయేరియా వెలుగు చూసిన తర్వాత.. ఆరోగ్య శాఖ మంత్రి, ఉన్నతాధికారులు సమీక్షలు జరిపి హడావిడి చేశారు. అయితే సమీక్షలు ముగిసిన వారం దాటినా పరిస్థితి మరింత దిగజారింది.



శారదా కాలనీ రిజర్వాయర్ వద్ద నీటి శాంపిల్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, కమిషనర్ కీర్తి చేకూరి



గాజుల సూర్యనారాయణ (75) (ఫైల్)

గుంటూరు(మెడికల్, కార్పొరేషన్), ఫిబ్రవరి 18: శారదాకాలనీ.. సంగడిగుంట.. రైలుపేట.. శ్రీనగర్.. ఇలా రోజురోజుకు డయేరియా ప్రభావిత ప్రాంతాలు తెరపైకి వస్తున్నాయి. రోజుకో ప్రాంతంలో మృతి ఘటనలు వెలుగుచూస్తున్నాయి. వాంతులు, విరేచనాలు.. వాటితో మృతుల వార్తలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఓ పక్క డయేరియా ప్రబలి ప్రజల ప్రాణాలు తీస్తుంటే.. అధికారులు సమస్యను పక్కదోవ పట్టించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గుంటూరు డయేరియా కోరల్లో చిక్కుకుంది. కలుషిత నీరు తాగి ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నా అధికారుల్లో చలనం లేదు. పది రోజులుగా ముగ్గురు మరణించగా.. ఆదివారం శ్రీనగర్‌కు చెందిన ఒకరు మృతి చెందారు. దీంతో గుంటూరులో డయేరియా మరణాలు నాలుగుకు చేరాయి. అయినా నామమాత్రపు చర్యలతో ప్రజాప్రతినిధులు, అధికారులు దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు డయేరియా వ్యాపించింది. సంగడిగుంటలో తిరుమలచారికాలనీకి చెందిన ఓబులు (54), శారదాకాలనీకి చెందిన పద్మావతి(18), రైలుపేటకు చెందిన మహమ్మద్ ఇక్బాల్(35), తాజాగా శ్రీనగర్‌కు చెందిన గాజుల సూర్యనారాయణ(75) మరణించిన వారిలో ఉన్నారు. మరో ముగ్గురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ఇంతా జరుగుతున్నా, జిల్లా యంత్రాంగం అతిసార నియంత్రణలో మొద్దునిద్రలో ఉందనే విమర్శలు వస్తున్నాయి. డయేరియా వెలుగు చూసిన తర్వాత.. ఆరోగ్య శాఖ మంత్రి, ఉన్నతాధికారులు సమీక్షలు జరిపి హడావిడి చేశారు. రెండు రోజుల్లో పరిస్థితి పూర్తి అదుపులోకి వస్తుందని ప్రకటించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని గుంటూరులోనే ఉంటున్నా పరిస్థితిలో మార్పు రాలేదు. అధికారుల మధ్య సమన్వయం కొరవడమే ఇందుకు కారణమనే ఆరోపణలున్నాయి. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో మురుగునీటిలోనే తాగునీటి పైపులు ఉన్నాయి. ఆ పైపులకు లీకులు కారణంగా కలుషిత నీరు తాగి వాంతులు, విరేచనాల బారిన పడుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నట్లు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శారదాకాలనీ, వసంతరాయపురం మెయిన్ రోడ్డులో పైపులకు పెద్దఎత్తున లీకులు ఏర్పడ్డాయి. దీంతో హడావుడిగా అధికారులు మరమ్మతులు చేపడుతున్నారు. పాత పైపులకు ఉన్న కొళాయి కనెక్షన్లను పూర్తిగా తొలగిస్తున్నారు. కొత్త కనెక్షన్లు ఇవ్వలేకపోతున్నారు. దీంతో ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు. ట్యాంకర్ల వద్దకు వెళ్లి నీటి కోసం పరుగులు తీస్తున్నారు.



శారదా కాలనీలో ట్యాంకర్ల వద్ద కుటుంబ సమేతంగా తరలివచ్చి మంచినీళ్లు పట్టుకుంటున్న ప్రజలు

కలెక్టర్ తనిఖీలు..

శారదాకాలనీ, వసంతరాయపురం, శ్రీనగర్‌లో తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై ఇంటింటి సర్వేను ఆదివారం కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తితో కలిసి పరిశీలించారు. తాగునీటిలో క్లోరిన్ శాంపిల్స్ పరిశీలించి ప్రజలకు అందించాలని అధికారులను ఆదేశించారు. శారదాకాలనీ రిజర్వాయర్ నుంచి సరఫరా చేస్తున్న తాగునీటి క్లోరిన్ పరీక్షలను కలెక్టర్ పరిశీలించారు. వసంతరాయపురం మెయిన్ రోడ్డులో వాల్ పిట్ శుభ్రత పనులను పరిశీలించారు. తాగునీటిని అన్ని ప్రాంతాల్లో శాంపిల్స్ తీసి పరీక్షలు నిర్వహించి, ఫలితాల వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. తాగునీటి వాల్‌పిట్‌లను శుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీటి పైప్‌లైన్ల పై గుర్తించిన లీకులను మరమ్మతు చేయాలన్నారు. ప్రజలు తాగునీటిపై ఏ సమస్య ఉన్నా కంట్రోల్ రూమ్ 90000 02109 నంబరుకి కాల్ చేస్తే అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.



శారద కాలనీలో మురుగనీటిలోని పైపులైను

వైద్యసేవలు అంతా గోప్యమే..

నగరంలో రెండు వారాలుగా 300 మంది వరకు డయేరియా బాధితులు గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చేరగా, ఇందుకు పదిరెట్లు బాధితులు ఇళ్లల్లో, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో, ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్సలు పొందుతున్నారు. వాస్తవ రోగుల సంఖ్యను చాలా తక్కువగా చూపుతూ అధికారులు ప్రకటన చేస్తున్నారు. హెల్త్ బులెటిన్‌లో కూడా వివరాలు సంపూర్ణంగా ఇవ్వడం లేదు. ఆదివారం కాకానిరోడ్డులోని ప్రైవేటు వైద్యశాలలో గాజుల సూర్యనారాయణ డయేరియా తీవ్రతతో మృతి చెందారు. దీనిపై అధికారులను వివరణ కోరితే, తమ దృష్టికి రాలేదని తెలిపారు. ఇదేరీతిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రతి రోజూ సగటున 10 వేల నుంచి 20 వేల ఇళ్లను సందర్శించి సర్వే చేస్తున్నట్లు ప్రకటిస్తోంది. గత వారం రోజులుగా హీనపక్షం లక్ష గృహాల్లో సర్వే జరిపినట్లు నివేదికలు ఇచ్చారు. సర్వేలో గుర్తించిన అతిసారం రోగులను పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో చేర్పించి చికిత్సలు చేయిస్తున్నట్లు ప్రకటిస్తున్నా, నేటికి పరిస్థితి ఎందుకు నియంత్రణలోకి రాలేదో వారికే తెలియాలి.

నీటి కాలుష్యమే కారణమని తెలిసినా..

ప్రధానంగా కార్పొరేషన్ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిలో కలుషితమే అతిసారానికి కారణమని స్వయంగా ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులే అనుమానం వ్యక్తం చేశారు. ఆయా ప్రాంతాల్లో మురుగు కాల్వల్లో మంచినీటి పైపులు ఉన్నాయి. డయేరియా ప్రబలిన అనంతరం ఆయా పైపులైన్లను మరమ్మతు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించినా సమస్య తీవ్రత తగ్గలేదు. మరో పక్క సమస్యను పక్కదారి పట్టించేలా అధికారులు వ్యవహరిస్తున్నారనే వాదనలున్నాయి. అతిసారం ప్రబలిన పలు ప్రాంతాల్లో నీటి నమూనాలు సేకరించి నాణ్యత ప్రమాణాల నిర్ధారణకు పంపారు. నాణ్యత ప్రమాణాలపై ల్యాబ్ ఇచ్చిన నివేదికలను తొక్కిపట్టిన అధికారులు, డయేరియాకు ఏమాత్రం సంబంధం లేని పానీపూరిని తెరపైకి తెచ్చారు. నగరంలో పానీపూరి బండ్లను నిషేధించాలని ప్రాంతీయ నీటి పరిశోధనశాల నిపుణులు నివేదిక ఇచ్చినట్లు ప్రకటించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది సమస్యను పక్కదారి పట్టించడమేనని ఆరోపించారు. ఇదేరీతిలో మినరల్ వాటర్ ప్లాంట్లలో నీరు తాగి బాధితులు డయేరియా బారిన పడి ఉంటారనే అనుమానం వ్యక్తం చేస్తూ మరో పసలేని వాదన తెరపైకి తెచ్చారు. కలుషిత సమస్యకు ప్రధాన కారణమైన నీటి పైపుల లోపాలను సవరించే ప్రక్రియ మాత్రం పెద్దగా జరగడం లేదు.



పట్టించుకోవటం లేదు

కాలనీలో నెలకొన్న దుస్థితిని అధికారులు పట్టించుకోవటం లేదు. గతంలో అనేక పర్యాయాలు అధికారులకు విన్నవించాం. పారిశుధ్యం అధ్వానంగా ఉందని, తాగునీరు సరఫరాలో మురుగునీరు వస్తుందని తెలిపాం. అయినా మా బాధలు ఎవరూ పట్టించుకోలేదు. తీరా డయేరియా వచ్చిన తర్వాత అధికారులు హడావిడి చేస్తున్నారు.

\- షేక్ రహంతుల్లా, శారదాకాలనీ, 25వ లైను



మనుషులు చస్తేనే స్పందనా..?

డయేరియా వచ్చి మనుషులు చనిపోతేనే అధికారులు స్పందించారు. ఇప్పుడు మా కాలనీకి వస్తున్నారు. అంతకుముందు మా గోడు ఎవరూ పట్టించుకోలేదు. తాగునీరు సక్రమంగా రాదు.. పారిశుధ్యం అధ్వానం. శారదాకాలనీ అంటే అధికారులకు చిన్న చూపు. మురుగునీరు పైపులైన్ ద్వారా సరఫరా అవుతుంది.

\- కత్తుల గురువమ్మ



పలుమార్లు చెప్పాం..

మా కాలనీలోని పైపుల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిలో పురుగులు వచ్చాయి. గతంలో అనేక పర్యాయాలు అధికారులకు విన్నవించాం. ఎవరూ పట్టించుకోలేదు. డయేరియా వచ్చిన తర్వాతనే అధికారులు కాలనీకి వస్తున్నారు. ఇదేదో ముందు జాగ్రత్త పడి ఉంటే ప్రాణాలు దక్కేవి కదా.

\- దాసరి దీనమ్మ, శారద కాలనీ



అందని.. అల్పాహారం

- పది విద్యార్థులకు అల్పాహార నిధులు లేనట్లేనా !
- హెచ్‌ఎంలు, ఎమ్మెల్సీ విజ్ఞప్తులు బుట్టదాఖలు చేసిన జడ్పీ పాలకవర్గం
- నెల గడుస్తున్నా నిధులు విడుదల చేయని వైనం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 18: నాడు నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖల్ని ఎటూ మార్చలేదు.. కనీసం పది విద్యార్థులకు పరీక్షల సమయంలో అల్పాహారం అందించడానికి ప్రభుత్వానికి మనసు రావడం లేదు. అల్పాహారం కోసం నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయుల సంఘం వినతిపత్రాలు ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా జడ్పీ పాలక వర్గం పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలల్లో పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దాదాపు 40వేలకు పైగా ఉన్నారు. మార్చిలో జరిగే పరీక్షలకు ఆయా విద్యార్థులకు ఏటా డిసెంబర్ నుంచే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు ప్రారంభం అవుతాయి. మధ్యాహ్నం 12 గంటలకు పాఠశాలలో భోజనం పెడతారు. తరువాత సాయంత్రం దాదాపు 7 గంటల వరకు పాఠశాలలోనే పది విద్యార్థులు ఉండాలి. ఈ సమయంలో వారు పాఠశాలలో ఆకలితో అలమటించాల్సిందే. ఈ నేపథ్యంలో పేద, దిగువ మధ్యతరగతికి చెందిన వారికి అల్పాహారం అందించడానికి ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాలుగా ఏర్పాట్లు చేస్తోంది.

అప్పట్లో అలా... ఇప్పుడిలా..

పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం కోసం ఒక్కో విద్యార్థికి రూ.7 నుంచి రూ.10 చొప్పున నిధులు మొత్తం దాదాపు రూ.35 లక్షలకు పైగా ఏటా విడుదల చేసేవారు. గత ప్రభుత్వాల హయాంలో దాదాపు మూడునెలల ముందే అల్పాహారం కోసం నిధులు విడుదల చేయడంతోపాటు దాతల నుంచి మరికొంత సొమ్ము సమకూరేలా ఏర్పాట్లుచేసేశారు. ఫలితంగా విద్యార్థులకు రోజు సాయంత్రం ఇండ్లీ, ఉప్మా, ఉడికించిన వేరుశనగలు, గుగ్గిళ్ళు వంటి అల్పాహారం, అరటి, జామ తదితర పండ్లు అందించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పరీక్షలకు నెలరోజు ముందు నుంచే అల్పాహారం పంపిణీ చేసేలా నిబంధనలు మార్చారు. దీనికి నిధులు కూడా సక్రమంగా విడుదల చేయడం లేదు. గత కొన్ని సంవత్సరాల నుంచి పాఠశాల గ్రాంట్ నుంచి వాడుకోవాలని, తరువాత నిధులు విడుదల చేస్తామని చెబుతూవచ్చారు. ఈ ఏడాది పాఠశాల గ్రాంట్ కూడా సక్రమంగా పాఠశాలలకు విడుదల చేయకపోవడంతో హెచ్‌ఎంలు అల్పాహారం పంపిణీ విషయం లో చేతులెత్తేశారు. ఫలితంగా విద్యార్థులు ఆకలితో అలమటిస్తూ తరగతులకు హాజరు కావాల్సివస్తోంది.

రెంటికిచెడ్డ రేవడిలా మున్సిపల్ విద్యార్థుల పరిస్థితి...

మున్సిపల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏటా మున్సిపాల్టీలు, కార్పొరేషన్ నుంచి అల్పాహారం కోసం నిధులు విడుదల అయ్యేవి. దాతలు, మున్సిపల్, కార్పొరేషన్ నిధులు కలిపి ఒక్కో విద్యార్థికి రూ.10 నుంచి రూ.20 వరకు విడుదల చేసే వారు. అయితే ఈ ఏడాది మున్సిపల్, కార్పొరేషన్ పరిధి నుంచి పాఠశాలల్ని తొలగించి ప్రభుత్వంలో విలీనం చేశారు. దీంతో ఈ విద్యార్థులకు అటు ప్రభుత్వం నుంచి కానీ ఇటు కార్పొరేషన్, మున్సిపల్ స్కూల్స్ నుంచి నిధులు విడుదల కావడం లేదు. రెంటికి చెడ్డ రేవడిలా విద్యార్థుల దుస్థితి తయారైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అల్పాహారం కోసం నిధులు విడుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఇసుక క్వారీలో భారీ గుంత వద్ద టీడీపీ, జనసేన నేతలు



ఎక్స్‌కవేటర్ దాచి ఉంచిన ఇసుకాసురులు

ఇసుక తవ్వకాలపై.. నిరసన

- గుండిమెడ క్వారీలో భారీ గోతులు గుర్తింపు
- టీడీపీ, జనసేన నేతల రాకతో పొదల్లోకి యంత్రాలు

తాడేపల్లి, ఫిబ్రవరి 18: ఐదేళ్లలో 50 కోట్ల టన్నుల ఇసుకను బొక్కేశారు.. అక్రమ తవ్వకాలతో గుంతలు ఏర్పడి ఏంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు.. అంటూ అక్రమ ఇసుక తవ్వకాలపై తాడేపల్లి మండలం గుండిమెడ ఇసుక క్వారీలో ఆదివారం టీడీపీ, జనసేన నేతలు నిరసన తెలిపారు. క్వారీలో భారీగా తవ్వేసిన గుంతలను, ఇసుక అక్రమ నిల్వలను పరిశీలించారు. నేతల రాక సమాచారంతో ఎక్స్‌కవేటర్, లారీలను, ట్రాక్టర్‌లను నిర్వాహకులు ముళ్లపొదల్లో దాచేశారు. అయినా వాటిలో కొన్నింటిని టీడీపీ జనసేన నేతలు గుర్తించారు. కృష్ణానదిలో సుమారు 5 కిలోమీటర్ల పొడవున ఇసుక అక్రమ తవ్వకాలను వారు పరిశీలించారు. ఇసుక అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని, ఇసుక దొంగలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త నందం అబద్దయ్య, అమరా సుబ్బారావు, కొమ్మారెడ్డి కిరణ్, జనసేన నేత సామల నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ ఇసుక తవ్వకాలు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో యథేచ్ఛగా జరుగుతున్నాయన్నారు. పేదలు వేలు ఖర్చు పెట్టినా సమయానికి ఇసుక అందడం లేదని, అధిక ధరలతో అల్లాడుతున్నారన్నారు. వైసీపీ నేతలు సృష్టించిన ఇసుక కొరతతో 123 రకాల కుల వృత్తుల వారు రోడ్డున పడ్డారన్నారు. 40 లక్షల మంది కార్మికుల పొట్ట కొట్టారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ.1000కి దొరికితే నేడు అది రూ.5 వేలైందన్నారు. అధికారులు ఎందుకు నిద్ర నటిస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, వల్లభనేని వెంకట్రావు, కేశంనేని శ్రీఅనిత, కొల్లి శేషు, కాట్రగడ్డ మధు, గోవాడ దుర్గారావు, కొల్లి సురేష్, విన్నకోట శ్రీనివాస్, అన్నెం కుసుమ, వీరిశెట్టి శ్రీనివాస్, బుల్లిబాబు, ఈపూరి కోటయ్య, చిగురుపాటి సుబ్బారావు, కంచర్ల రంగారావు, ఓలేటి రాము, కేళి వెంకటేశ్వరరావు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గుండిమెడ ఇసుక క్వారీలోకి వెళుతున్న టీడీపీ, జనసేన నేతలు



పశ్చిమలో.. ఓటు కోసం

- జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి దరఖాస్తులు
- ఇప్పటికే నాలుగు వేలకు పైగా బీఎల్‌వోలకు రాక
- దరఖాస్తులను యథాతథంగా ఆమోదించాలని ఒత్తిళ్లు
- వలంటీర్ల క్రియాశీలక పాత్ర.. ఓ వైసీపీ నేత పర్యవేక్షణ

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి గుంటూరు పశ్చిమకు ఓటర్ల బదిలీ పెద్దఎత్తున జరుగుతోన్నది. కొన్ని రోజుల నుంచి వలంటీర్లు ఇదే పని మీద పని చేస్తున్నారు. ప్రతీ 15 మంది వలంటీర్లకు వైసీపీ నేత నియమించిన వ్యక్తి పర్యవేక్షకుడిగా వ్యవహరిస్తూ ఫారం-6లు, ఫారం-8లు పెట్టిస్తున్నారు. అన్ని ఒక ప్రాంతంలో పెడితే అనుమానం వస్తుందని, మారుమూల పోలింగ్ బూత్‌ల పరిధిలో దరఖాస్తులు చేయిస్తున్నారు. వాటిని యథాతథంగా ఆమోదించాలని బీఎల్‌వోలుగా విధులు నిర్వహిస్తున్న సచివాలయాల కార్యదర్శులపై ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో కొంతమంది వైసీపీ కార్పొరేటర్లు, డివిజన్ స్థాయి నేతలు బీఎల్‌వోలకు ఫోన్లు చేసి ఆమోదించాలంటున్నారు. ఎవరైనా బీఎల్‌వోలు తమ వల్ల కాదంటే వెంటనే వారిపై ఫిర్యాదులు చేసి వార్నింగ్‌లు కూడా ఇప్పిస్తున్నారు.

టీడీపీకి చెక్‌పెట్టేందుకు అధికార దుర్వినియోగం

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడైనా గెలవాలని వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. గత రెండు పర్యాయాలుగా ఇక్కడ టీడీపీ అభ్యర్థులే గెలుపొందుతున్నారు. ఈ దఫా కూడా నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉన్నది. దీంతో వైసీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడటం ప్రారంభించింది. మంత్రి విడదల రజినిని ఇక్కడ సమన్వయకర్తగా నియమించింది. అప్పటి నుంచి పశ్చిమలోని పబ్లిక్ ప్రాంతాలన్నింటిలో పెద్దపెద్ద కటౌట్‌లు ఏర్పాటు చేశారు. బ్యానర్లు కడితే మరసటి రోజు తొలగించే నగరపాలకసంస్థ సిబ్బంది ఈ కటౌట్ల జోలికి వెళ్లడం లేదు. కాగా వలంటీర్ల ద్వారా ఇప్పటికే డోర్-టూ-డోర్ సర్వే చేయించారు. మళ్లీ జగన్ రావాలనుకొంటున్నారా అన్న ఏకైక ప్రశ్నతో సర్వే చేసి వైసీపీ అనుకూలురు, వ్యతిరేకులు, తటస్థులను విభజించారు. ఒక వలంటీర్ క్లస్టర్ పరిధిలో మ్యాపింగ్ అయి ప్రస్తుతం వేరే నియోజకవర్గంలో ఉంటున్న వారి ఓట్లను ఇక్కడికి బదిలీ చేయిస్తున్నారు. నిబంధనల ప్రకారం సాధారణ నివాసితులకు మాత్రమే ఓటు హక్కు కల్పించాలి. అయినా బీఎల్‌వోలను అదిరించి, బెదిరించి ఫారం-8లు పెట్టిస్తున్నారు. ప్రధానంగా ప్రతీ నెలా పెన్షన్ తీసుకునే వారిని, సంక్షేమ పథకాల లబ్ధిదారులని లక్ష్యంగా చేసుకున్నారు. వీరితో వలంటీర్లకు ఎక్కువగా సంబంధాలు ఉన్నాయి. వీరికి వేరే నియోజకవర్గంలో ఓటు ఉన్నా ఇక్కడ ఓటుహక్కు కోసం దరఖాస్తు పెట్టిస్తున్నారు. ఈ విధంగా ఒక్కో సచివాలయం పరిధిలో గత వారం, పది రోజులుగా కొత్త ఫారం-6, 8లు వస్తున్నట్లు బీఎల్‌వోలు చెబుతున్నారు. ఇప్పటికే నాలుగు వేల దరఖాస్తులు ఇలా వచ్చి ఉంటాయని అంచనా. ఈ విధంగా ఓట్లు చేర్పించి ఎన్నికల్లో గెలవాలని వైసీపీ ప్రయత్నిస్తోండటంపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే వీటిపై ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదులు పంపాయి.




తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి , జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

నమ్మక ద్రోహానికి నాలుగున్నర ఏళ్లు

● 1524వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 18: అమరావతిని బ్రహ్మాండంగా కడతానని ఎన్నికల ముందు చెప్పి అధికారం చేపట్టి, ఆ తర్వాత సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కలాటతో నమ్మక ద్రోహం చేసి నాలుగున్నర ఏళ్లు అయ్యిందని రాజధానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న నిరసన దీక్షలు, ఆందోళనలు ఆదివారం నాటికి 1524వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, అన్నదాతను క్షోభ పెట్టిన వారు ఎప్పటికైనా అంతకంత అనుభవించక తప్పదన్నారు. వైసీపీ నేతలు అమరావతిపై అసత్య ప్రచారాలు చేసి పాపం మూట కట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు ముక్కలాట రాష్ట్రానికే చేటన్నారు. జీవనాధారమైన మూడు పంటలు పండే భూమిని రాష్ట్ర రాజధాని కోసం ఇచ్చామన్నారు. ఆ చట్టాన్ని కూడా కాదని జగన్‌రెడ్డి మూడు రాజధానులని రైతులను మానసిక క్షోభకు గురి చేసి రెండు వందల మందికి పైగా రైతులు మరణించటానికి కారణమయ్యాడన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. తుళ్లూరు, మందడం, వెంకటపాలెం, వెలగపూడి, ఉద్దండ్రాయునిపాలెం, అనంతవరం, నెక్కల్లు తదితర రాజధాని గ్రామాల్లో రైతుల ఆందోళనలు నిర్వహించారు.

పెళ్లి వేడుకల్లో అపశ్రుతి

● త్రుటిలో తప్పిన ప్రమాదం

● బాణసంచా పేలి వాహనం, పెళ్లి పందిరి దహనం


దగ్ధమవుతున్న వాహనం

నరసరావుపేట, ఫిబ్రవరి 18: నరసరావుపేట పట్టణంలోని రామిరెడ్డిపేటలో పెళ్లి వేడుకల్లో ఆదివారం అపశృతి చోటుచేసుకుంది. తృటిలో పెద్ద ప్రమాదం తప్పిపోయింది. పెళ్లి సందర్భంగా ఊరేగింపు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాలుస్తున్నారు. ఈ నిప్పురవ్వలు బాణసంచా నిల్వ ఉంచిన వాహనంపై పడ్డాయి. దీంతో నిప్పు అంటుకుని ఒక్కసారి బాణసంచా ప్రేలుడు సంభవించింది. ఆ ప్రాంతంలో జనం పరుగులు తీశారు. ఇంటి ముందు ఏర్పాటు చేసిన పెళ్లి పందిరికి కూడా నిప్పు అంటుకోవడంతో పందిరి దహనమైంది. ఫైర్ ఇంజన్ అందుబాటులో లేకపోవడంతో ఆ ప్రాంతవాసులు నీటితో మంటలను ఆర్పివేశారు. బాణసంచా నిల్వ చేసిన వాహనం, మరో తోపుడు బండి పూర్తిగా దహనమయ్యాయి.

ఆర్టీసీ బస్సులన్నీ సిద్ధం సభకు..

● బస్టాండ్‌లు వెల వెల... ● ప్రైవేటు వాహనాల బాటపట్టిన ప్రయాణీకులు

● డొక్కు బస్సులతో తిప్పలు పడుతోన్న ప్రయాణీకులు


బస్సుల్లేక వెలవెలబోయిన ఎన్‌టీఆర్ బస్టాండ్


జీటీ రోడ్డులో నిలిచిపోయిన డొక్కు బస్సు

గుంటూరు, ఫిబ్రవరి 18: ఆర్టీసీ బస్టాండ్‌లు వెలవెలబోతున్నాయి. అనంతపురంలో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు తరలివెళ్ళటంతో ఆర్టీసీ బస్టాండ్‌ల ప్రాంగణాలు బోసిపోతున్నాయి. అటు బస్సుల్లేక, ఇటు ప్రయాణీకుల్లేక బస్టాండ్‌లు కళావిహీనంగా మారాయి. అనంతలోని సిద్ధం సభకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 292 బస్సులు తరలివెళ్ళిన విషయం తెలిసిందే. అసలే అరకొరగా ఉన్న కండిషన్ బస్సులను సీఎం సభకు తరలించటంతో డొక్కు బస్సులను మిగిల్చారు. సీఎం సభకు తరలించటంతో శని, ఆది, సోమవారం మూడు రోజుల పాటు ప్రజలు అనేక ఇబ్బందులు చవిచూడాల్సి వస్తోంది. దాంతో చేసేది లేక ప్రజలు ఆటోలు, టాటామ్యాజిక్‌లు, కార్లు వంటి ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు వాహనాలు ఛార్జీల బాదుడు పెంచేశారు. అటు పర్చూరు రూట్‌లో, ఇటు అమరావతి రూట్‌లో తాడికొండ, తుళ్ళూరు, విజయవాడ రూట్‌లలో ప్రైవేటు వాహనాల ఛార్జీల బాదుడు పెంచేశారని ప్రయాణీలు వాపోతున్నారు. అసలే అరకొర బస్సులతో నెట్టుకొస్తున్న సిబ్బందికి మార్గమధ్యంలో డొక్కు బస్సులు నిలిచిపోవటం తలకు మించిన భారంగా మారుతోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి జీటీ రోడ్డులోని పొగాకు బోర్డు కార్యాలయం ఎదుట గుంటూరు నుంచి నరసరావుపేటకు వెళుతున్న నరసరావుపేట డిపో బస్సు అర్ధాంతరంగా నిలిచిపోయింది. దాంతో మరో బస్సు కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది.

డయేరియా మరణాలు బాధాకరం

● సీపీఐ జాతీయ కార్యదర్శి కట్టా నారాయణ ● డయేరియా బాధితులకు పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న కె.నారాయణ, కె.రామకృష్ణ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి18: కలుషిత నీరు తాగి నగరంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం, అనేకమంది డయేరియా బారిన పడటం బాధాకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి కట్టా నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఆ పార్టీ నాయకులు కె.రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, కోటా మాల్యాద్రిలతో కలసి ఆయన పరామర్శించారు. అనంతరం కె.నారాయణ మాట్లాడుతూ సరైన సమయంలో అధికారులు స్పందించినట్లయితే ఈ ప్రమాదం వచ్చేది కాదని అభిప్రాయపడ్డారు. జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ మృతిచెందిన కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం తక్షణమే అందజేయాలని డిమాండ్ చేశారు. బాధితులందరికీ వైద్య చికిత్స అందించడంతో పాటు, వారు కోలుకునే వరకు ఉచితంగా మందులు అలాగే రూ.25 వేల ఆర్థిక సాయం ఇవ్వాలన్నారు. నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారిస్తున్న ప్రభుత్వం స్వచ్ఛమైన మంచి నీళ్లు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మేడా హనుమంతరావు, జంగాల చైతన్య, వలి, నాసర్‌జీ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన బాలోత్సవం


గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 18: స్థానిక హిందూ కళాశాలలో గత రెండు రోజులుగా పెద్దఎత్తున నిర్వహించిన బాలోత్సవం 2024 పిల్లల పండుగ ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిసింది. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న కిడ్స్ ఇంజనీరింగ్ విద్యాసంస్థల అధినేత కోయ సుబ్బారావు, మలినేని ఇంజనీరింగ్ కళాశాలల ఛైర్మన్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ విద్యార్థి దశలో మానసిక ఎదుగుదలకు నూతన ఆవిష్కరణల రూపకల్పనలతో వారి సమగ్ర వికాసానికి బాలోత్సవాలు దోహదపడతాయని చెప్పారు. శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మూడవ బాలోత్సవంలో 40 విభాగాలలో 4,800 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారి వారి ప్రతిభను ప్రదర్శించారని భవిష్యత్తులో 100 కేంద్రాల్లో బాలోత్సవాలను నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్ని విభాగాలలో అత్యుత్తమంగా రాణించిన సీనియర్స్ జూనియర్స్ విభాగాలలో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ విన్నర్స్ శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ రనర్స్‌గా నిలిచి అతిథులు చేత ట్రోఫీలను అందుకున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్స్ జిల్లా మాజీ గవర్నర్ నూతల పాటి వీర ప్రకాష్‌రావు, కాటూరి వెంకటేశ్వరరావు, కన్వీనర్ డాక్టర్ ఎం.బోసుబాబు, డాక్టర్ కేఎస్ దుర్గాప్రసాద్, జాన్ బాబు, కార్యదర్శి బి.ప్రసాద్, జివి సుబ్బారాయుడు, అనిల్, న్యాయ నిర్ణేతలు, వివిధ పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు

నడికుడి రైల్వేస్టేషన్.. ఈట్ రైట్

● ఎఫ్ఎస్ఎస్ఏఐ ద్వారా ఈట్ రైట్ స్టేషన్ సర్టిఫికేట్ ● గుంటూరు రైల్వే డివిజన్‌లో ప్రప్రథమం


నడికుడి రైల్వేస్టేషన్

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆహారం భుజించడానికి నడికుడి రైల్వేస్టేషన్ అనువైనదని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సర్టిఫికేట్ జారీ చేసింది. దక్షిణ మధ్య రైల్వేజోన్‌లో మొత్తం మూడు రైల్వేస్టేషన్లకు ఈ సర్టిఫికేట్ రాగా అందులో నడికుడి ఒకటిగా ఉన్నది. మిగతా రెండు హైదరాబాద్(నాంపల్లి), అన్నవరం స్టేషన్లు ఉన్నాయి. కాగా గుంటూరు డివిజన్‌లోనే నడికుడి రైల్వేస్టేషన్ ప్రప్రథమంగా ఈ సర్టిఫికేట్ పొందింది. ఇందుకోసం కృషి చేసిన ప్రతీ ఒక్క రైల్వే వాణిజ్య విభాగం అధికారులను గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు.

ఏటా ఎఫ్ఎస్ఎస్ఏఐ రైల్వేస్టేషన్లలో ఆహార పదార్థాల నాణ్యత, వాతావరణం, పరిసరాలు, ప్రమాణాల పాటింపుని పరీక్షించి ఈట్ రైట్ స్టేషన్ సర్టిఫికేట్‌ని జారీ చేస్తుంది. డివిజన్‌లో ఈ పత్రం పొందేందుకు నడికుడి రైల్వేస్టేషన్‌ని ఎంపికచేసిన డివిజన్ అధికారులు నాణ్యత ప్రమాణాలు పెంపొందించేందుకు అనేక చర్యలు తీసుకొన్నారు. ఫుడ్‌సేఫ్టీ, ట్రైనింగ్ మీద సలహాదారులకు శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత వాణిజ్య, ఆహార భద్రత అధికారులు వివిధ అంశాలను పరిశీలించారు. ఆహార భద్రత, పరిశుభ్రత, ప్రమాణాలు, విక్రేతల వ్యక్తిగత పరిశుభ్రత, రక్షణ పరికరాలు, ఆహార ఉత్పత్తుల గడువు తేదీలు, ఉష్ణోగ్రత నియంత్రణ, వ్యర్థాల తొలగింపు, తడి-పొడి వ్యర్థాల విభజనని పర్యవేక్షించారు. తొలుత ప్రీ-ఆడిట్‌ని నిర్వహించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేట్ జారీచేసే ముందు ఫైనల్ ఆడిట్ నిర్వహించి అన్ని సవ్యంగా ఉండటంతో పత్రం ఇచ్చింది. ఆరు నెలల పర్యవేక్షణ, మూల్యాంకనం తర్వాతే ఈ సర్టిఫికేట్‌ని నడికుడి రైల్వేస్టేషన్‌కు జారీ చేశారు.

జగన్ బీసీ వర్గాలను నయవంచన చేశారు

● రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి యేసుబాబు

చుండూరు, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి 52 సంఘాలు ఏర్పాటు చేశానని గొప్పగా ప్రకటించుకున్న ముఖ్యమంత్రి జగన్ వాటికి నయాపైసా కూడా నిధులు ఇవ్వకుండా అలంకార ప్రాయంగా మార్చారని రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి యేసుబాబు ఆరోపించారు. ఆదివారం చుండూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో జగన్ ప్రసంగం అంతా బీసీ వర్గాలను మోసపుచ్చే విధంగా సాగిందన్నారు. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలులో ఉండగా దానిని జగన్ 24 శాతానికి కుదించారన్నారు. అదే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సంక్షేమానికి, అభ్యున్నతికి రూ.కోట్లు నిధులు వెచ్చించి ఆ వర్గాలపై అభిమానం చాటుకున్నారు. ప్రస్తుతం మా బీసీలు అంటూ కపట ప్రేమ వలకబోస్తున్న జగన్మోహనరెడ్డి తాను ఏర్పాటు చేసిన బీసీ సంఘాల్లో దేనికి ఎంత నిధులు కేటాయించాడు, ఎంతమందికి దాని వల్ల లబ్ధి చేకూరింది, బీసీలు జగన్ పాలనలో ఎంత అభివృద్ధి చేసింది వివరించాలని యేసుబాబు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల రాష్ట్ర నాయకులు శొంఠి రామారావు, యడ్ల జయశీలరావు, పోతార్లంక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోని ఇరువర్గాల ఘర్షణ

నరసరావుపేట, ఫిబ్రవరి 18: నరసరావుపేట మండలం జొన్నలగడ్డలో నిర్వహించిన గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా శనివారం రాత్రి వైసీపీలోని ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. రెండు సామాజిక వర్గాలవారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఘర్షణలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. క్షతగాత్రులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గడపగడపకు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట లోక్‌సభ వైసీపీ అభ్యర్థి అనిల్ కుమార్‌యాదవ్ నిర్వహించారు. కార్యక్రమం అనంతరం విందు ఏర్పాటు చేశారు. విందులో సదరు సామాజిక వర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేస్తుకున్నారు. ఈ సందర్భంగా ఒక వర్గం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే కేసు నమోదు చేయవద్దని రాజీ చేసుకుంటామని ప్రజాప్రతినిధులు పోలీసులను ఆదేశించారు. క్షతగాత్రులు ఇచ్చిన ఫిర్యాదు పోలీసులు పక్కన పడేయడం పట్ల సదరు వర్గ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డీవీసీ హాస్పటల్ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం

● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్


వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తదితరులు

చేబ్రోలు, ఫిబ్రవరి18: డీవీసీ హాస్పటల్ ద్వారా పాల రైతులకు, పేదలకు రాయితీపై కార్పొరేట్ వైద్య సేవలను అందిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని వేజండ్ల గ్రామంలో డీవీసీ హాస్పటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని నరేంద్రకుమార్, హాస్పటల్ ఎండీ జ్యోతిర్మయి తదితరులు ప్రారంభించారు. వేజండ్ల పరిసర ప్రాంతాలకు చెందిన 650 మంది వైద్యశిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో పలు రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేసి రోగులకు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్పటల్ ఎండీ జ్యోతిర్మయి మాట్లాడుతూ సేవే లక్ష్యంగా డీవీసీ హాస్పటల్ వైద్య సేవలు అందిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం ఖరీదుగా మారిన నేపథ్యంలో ప్రజలకు అందుబాటులోకి కార్పొరేట్ వైద్యాన్ని తెచ్చినట్లు చెప్పారు. అత్యుత్తమ ప్రమాణాలతో హాస్పటల్‌ను నిర్మించటమే కాకుండా అధునాతన వైద్య పరికరాలను అందుబాటులోకి తెచ్చి ఉత్తమ డాక్టర్లతో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సీవోవో డాక్టర్ కరణం నవీన్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చల్లగండ్ల శ్రీనివాస్, వైద్యులు డాక్టర్ అమరేంద్ర, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ జిష్ను, డాక్టర్ మధుశ్రీ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, హాజరైన గురజాల మండలానికి చెందిన ఐటీ ఉద్యోగులు

అరాచక పాలన అంతానికి మీ ఓటే ఆయుధం

● హైదరాబాద్‌లో గురజాల ఐటీ ఉద్యోగులతో యరపతినేని సమావేశం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించేందుకు నేటి యువతకు ఓటే ఆయుధమని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో నివసిస్తున్న గురజాల ప్రాంతానికి చెందిన ఐటీ ఉద్యోగులతో యరపతినేని సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గురజాల మండలానికి చెందిన వందలాది మంది ఐటీ ఉద్యోగులు పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్, నందమూరి తారకరత్న చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యరపతినేని మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంతో పాటు గురజాల నియోజకవర్గంలోనూ అరాచకపాలన పెరిగిపోయిందన్నారు. వైసీపీ నేతల ధనదాహానికి పలువురు చిన్నారులు మృత్యువాత పడ్డారని గుర్తుచేశారు. రాష్ట్ర రాజధాని అమరావతే లేకుండా విధ్వంసానికి పూనుకోవడం వల్ల లక్షలాది మంది యువత భవిష్యత్ అంధకారమైందన్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి ప్రాంతాల్లో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయగా వైసీపీ వచ్చిన ఐదేళ్లలో అవన్నీ పక్క రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. రేపటి ఎన్నికల్లో ఐటీ ఉద్యోగులు, యువత వారి కుటుంబసభ్యులందరూ చంద్రబాబుకు మద్దతుగా టీడీపీని గెలిపించాలని కోరారు. గురజాల కేంద్రంగా పల్నాడు జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తానని, అధికారం వచ్చిన ఐదేళ్లలో గురజాల నియోజకవర్గంలోని యువతీ యువకులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా పలు మెగా జాబ్‌మేళాలను ఏర్పాటు చేస్తానని తెలిపారు. గత నెలలో గురజాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించిందని గుర్తుచేశారు. సమావేశంలో యరపతినేని తనయుడు మహేష్, పులుకూరి కాంతారావు, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, నేలవల్లి బొల్లయ్య, పోటు నాగేశ్వరరావు, అడపా శ్రీనుతో పాటు ఐటి ఉద్యోగులు గజవల్లి నరేష్, కత్తి విఘ్నేష్, షేక్ అమీర్, బొల్నేడి రమ్య, సూదిరెడ్డి స్వాతి, శ్రీకాంత్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల పట్ల ఎప్పటికీ కృతజ్ఞతాభావం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి


ముస్లింలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 18: ముస్లింలకు తాను, తన కుటుంబం ఎప్పటికీ కృతజ్ఞతాభావంతో ఉంటామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. పట్టణంలోని 28, 29 వార్డులకు చెందిన గొట్టిపాళ్ల వంశస్తులు 60 వైసీపీ కుటుంబాలు ఆదివారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వీరికి బ్రహ్మారెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ తన స్వగ్రామం వెల్దుర్తి అయినప్పటికీ పుట్టి పెరిగింది పట్టణంలోని తూర్పు బావి ముస్లిం బజారులోనే అని, ఇక్కడి స్థితిగతులపై తనకు అవగాహన ఉందని చెప్పారు. కుటుంబ పోషణ నిమిత్తం ముస్లింపెద్దలు ఎక్కువగా శ్రమిస్తుంటారని, వారి జీవన విధానం మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే నాలుగున్నరేళ్లుగా ముస్లింల అభివృద్ధికి చేసిన కృషిని ఓ పేపరుపై రాసి, మరో పేపరు ఖాళీగా ఉంచాలన్నారు. తనకు అవకాశం ఇచ్చిన తరువాత నాలుగున్నరేళ్లలో ముస్లింల అభివృద్ధి మూడు రెట్లు అధికంగా చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు బాబుఖాన్, మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు నాగూర్‌బాషా, పట్టణ అధ్యక్షుడు షైనా, యెనుముల కేశవరెడ్డి, వంగులూరి పుల్లయ్య, గోగుల సీతారెడ్డి, మేకల దాసు, జబ్బార్, జానీ, బడే వలి, గొట్టిపాళ్ల సైదా, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి ఆటవిక చర్య

● కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 18: అనంతపురంలో జరిగిన సిద్ధం సభలో ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ కార్యకర్తల దాడి ఆటవిక చర్య అని మాజీ మంత్రి, టీడీపీ సత్తెనపల్లి నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆటవిక జంతువులు దాడి చేసినట్టు ఉన్మాదులు, సైకోలు వీరంగం చేసినట్లు అత్యంత పాశవికంగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేశారన్నారు. ఈ దాడి రాష్ట్రంలో పరిస్థితి ఏవిధంగా ఉందో తెలియజేస్తుందన్నారు. ఇది మీడియాపై వైసీపీ చేసిన ఫ్యాక్షన్ దాడి అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు, మీడియాకు భద్రత ఉంటుందని కన్నా పేర్కొన్నారు.


ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి 18 : అనంతపురం జిల్లాలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం దుర్మార్గమని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఖండించారు. ఆయన మాట్లాడుతూ రాప్తాడులో జరిగిన సిద్ధం బహిరంగ సభకు ఏబీఎన్ తరఫున జిల్లా ఫొటోగ్రాఫర్ కృష్ణ హాజరుకావటం జరిగిందని, ప్రోగ్రామ్‌ను కవర్ చేస్తున్న కృష్ణపై వైసీపీ నాయకులు, వైసీపీ గూండాలు విచక్షణారహితంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విలేకరులపై దాడులు దుర్మార్గం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి


మాచర్ల, ఫిబ్రవరి 18: విలేకరులపై దాడులు చేయడం దుర్మార్గమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో విలేకరులపై దాడులు పెరిగాయన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ రౌడీమూకలు దాడి చేసి గాయపరచడం హేయమైన చర్య అన్నారు. ఈ దాడిని ప్రభుత్వం ఖండించకపోవడం అన్యాయమన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.42 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142, 151, 165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

మొద్దు నిద్ర నటిస్తున్న జగన్ ప్రభుత్వం

● టీడీపీ గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర



గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): డయేరియా ప్రబలి గుంటూరులో వందలాది మంది ఆస్పత్రిపాలై, లెక్కలోకి రాకుండానే అనేక మంది చనిపోతున్నా వైసీపీ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తోందని టీడీపీ గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర (నాని) ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నగరంలో డయేరియా ప్రబలి ప్రజలు చనిపోయారని, దీని మీద గట్టి చర్యలు తీసుకోవాలని తాము డిమాండ్ చేస్తే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తమ వ్యాఖ్యలను అవహేళన చేశారన్నారు. అసలు ఇది డయేరియానే కాదని వాదించిన ఆమె ఈ రోజు శ్రీనగర్ కాలనీలో చనిపోయిన గాజుల సూర్య నారాయణ మృతిపై ఏం చెబుతారంటూ నిలదీశారు. ఇప్పటికీ అనేకమంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్న విషయం మంత్రి తెలుసుకోవాలన్నారు. ఈ విషయాలను దాచాలని ప్రయత్నించటం మంత్రి అవివేకానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా పాలకులు మేల్కొని ప్రజల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు.

డయేరియా కోరల్లో ప్రజలు..

● టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్



గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు డయేరియా కోరల్లో చిక్కుకొని అల్లాడిపోతున్నారని టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నగర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దాహంవేసి గొంతు తడుపుకో వాలంటేనే నగర ప్రజలు వణికిపోతున్నారన్నారు. 15, 20 రోజులు గడుస్తున్నా కలుషిత తాగునీటిపై అధికారులు చర్యలు చేపట్టలేకపోవడం సిగ్గుచేటన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. ఇప్పటికే కలుషిత నీటి బారినపడి నలుగురు మృతి చెందగా, వందల మంది జీజీహెచ్, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతు న్నారన్నారు. పాలకుల నిర్లక్ష్యం, అధికారులు ఉదాసీనత కారణంగానే తాగునీటిలో డ్రైయినేజి మురుగు కలసి డయేరియా ప్రభలిందన్నారు. సకాలంలో చర్యలు తీసుకుని ఉంటే మరణాలు సంభవించేవి కాదన్నారు. సంబంధిత అధికారులు, నగరంలో ఉంటున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, నగర మేయర్, ఎమ్మెల్యేలు కంటితుడుపు చర్యలు చేపడుతున్నారే తప్ప పరిష్కారం చూపడంలేదని ప్రభాకర్ మండిపడ్డారు.

అక్రమ కేసులతో భయపెట్టలేరు

● టీడీపీ పశ్చిమ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య



గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్, జనసేనాని పవన్ కళ్యాణ్‌లపై అక్రమ కేసులు బనాయించి భయపెట్టలేరని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య అన్నారు. గుజ్జనగుండ్లలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమ కేసులతో బాబు, లోకేశ్, పవన్‌లను భయ పెట్టాలనుకోవడం అవివేకమని ఎద్దేవాచేశారు. జగన్ నేర చరిత్ర, బాబు-పవన్‌ల నిజాయితీ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. నేర చరిత్ర కలిగిన జగన్ ఆయన రాజకీయ ప్రత్యర్థులపై నేర మరక పూయాలనుకోవడం హాస్యాస్పదమని అన్నారు. బాబు, పవన్‌లకు ప్రజలలో చెక్కుచెదరని క్లీన్ ఇమేజ్ ఉన్నదని, ఎన్ని అసత్యాలు ప్రచారం చేసినా అది చెరగదన్నారు. ఐదు సంవత్సరాలలో లక్షల కోట్లు అవినీతికి పాల్పడిన జగన్ ప్రభుత్వానికి ఎన్నికల అనంతరం తగిన గుణపాఠం తప్పదని శేషయ్య హెచ్చరించారు.



'మై ఫస్ట్ ఓట్ టూ సీబీఎన్' కార్యక్రమంలో పాల్గొన్న యువత

రాష్ట్రం తలరాతని మార్చాల్సింది యువతే..

గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం తలరాతని మార్చాల్సిన కర్తవ్యం యువతరానిదేనని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ అన్నారు. అరండల్‌పేటలో ఆదివారం 'మై ఫస్ట్ ఓట్ టూ సీబీఎన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డమ్మీ ఈవీఎంలతో తొలి ఓటర్లకు ఓటు వేసే విధానాన్ని నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వేసే సమయంలో అప్రమత్తంగా వుండాలని, తొలిసారి అవగాహనా లోపంతో ఓటు సద్వినియోగం చేసుకోలేకపోతే రాష్ట్రమే నష్టపోతుందని హెచ్చరించారు. జగన్‌పాలనలో అధోగతిపాలైన రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన కర్తవ్యం యువతపైనే వుందని, అందుకే తొలిసారి ఓటువేసేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీలీడర్స్- వారియర్స్ జానకీ రామయ్య, మలిక, పద్మ, యువత పాల్గొన్నారు.

డయేరియా చావులు ప్రభుత్వ హత్యలే !

● జనసేన నగర అధ్యక్షుడు నేరెళ్ల విమర్శలు

గుంటూరు (మెడికల్) ఫిబ్రవరి 18: నగరంలో సంభవించిన డయేరియా మరణాలన్ని ప్రభుత్వ హత్యలుగా పరిగణించాలని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్ విమర్శించారు. ఆదివారం స్థానిక శ్రీనగర్‌లో డయేరియాతో మృతి చెందిన గాజుల సూర్యనారాయణ (75) మృత దేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రజలకు గుక్కెడు రక్షిత తాగునీరు ఇవ్వలేని దుస్థితిలలో జీఎంసీ ఉండటం పాలకులు సిగ్గుపడాల్సిన విషయమన్నారు. డయేరియా ఆనవాళ్లు లేవంటూ మేయర్, కమిషనర్ వ్యాఖ్యానించడం బాధ్యతారహిత్యమని సురేష్ ఆక్షేపించారు. అనంతరం నేరెళ్ల సురేష్, గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి వెళ్లి డయేరియా బాధితులకు పండ్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకడులు ఆళ్ల హరి, గాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 18: గుంటూరు స్థానిక అరండల్‌పేటలోని ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషినల్స్ అసోసియేషన్ (అవోపా.) ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు పెన్షన్లు, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షులు కేవీ బ్రహ్మం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ కాటన్ వ్యాపారి చందోలు శివరామకృష్ణ ప్రసాద్, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు మాజేటి రామారావు పాల్గొన్నారు. 108 మందికి రూ.500 చొప్పున ప్రతినెల పెన్షన్లు ఇవ్వడం, అభినందనీయమని చందోలు శివరామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో వీ.జనార్థనరావు, అవోపా రాష్ట్ర కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, నగర కార్యదర్శి రాధాకృష్ణయ్య, ట్రెజరర్ ఎం.శ్రీనివాసరావు, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

ఘనంగా శ్రీ వైష్ణవి హాస్పిటల్ ప్రారంభం

గుంటూరు (మెడికల్) ఫిబ్రవరి 18: స్థానిక కాకానిరోడ్డులోని బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ ఎదుట డాక్టర్ కిలారి సునీల్ కుమార్, డాక్టర్ చంద్ర రాధిక రాణీలచే అధునాతన సౌకర్యాలతో 100 పడకలతో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వైష్ణవి హాస్పిటల్‌ను ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ.. ప్రతి మనిషి ఆరోగ్యంగా జీవించడం అవసరమని, వైద్యరంగంలో సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని మనిషి జీవన ప్రమాణాలను పెంచుకుంటున్నాడని తెలిపారు. శ్రీవైష్ణవి హాస్పిటల్ అచిరకాలంలోనే ప్రజల ఆదరాభిమానాలు పొందాలని మంత్రి రజిని ఆకాంక్షించారు. ప్రత్యేక అతిథులుగా హాజరైన తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ, తదితరులు సునీల్ కుమార్, రాధిక రాణి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో చంద్రచ్ఛమాంబ, రవీంద్ర దంపతులు, హైందవీ, సంయుక్త, వీఆర్వోలు జీ.రామ్మోహన్‌రావు, సీహెచ్. రమేష్, మణికంఠ పాల్గొన్నారు.

క్లోరిన శాంపిల్‌ని నిశితంగా పరిశీలించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

● ఆ తర్వాతే ప్రజలకు నీటిని విడుదల చేయాలి
● అధికారులను ఆదేశించిన కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి
● తాగునీటి సమస్యపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు
● సమస్యాత్మక ప్రాంతాల్లో కలెక్టర్, కమిషనర్ పర్యటన

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 18 క్లోరిన్ శాంపిల్స్‌ని తరచూగా, నిశితంగా పరిశీలించి తర్వాతే నగరంలోని ప్రజలకు అందించాలని తాగునీటిని సరఫరాచేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం నగర పాలకసంస్థ పరిధిలో శారదాకాలనీ, వసంతరాయ పురం, శ్రీనగర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ప్రత్యేక బృందాలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేనునగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరితో కలసి కలెక్టర్ పర్యవేక్షించారు. శారదాకాలనీ రిజర్వాయర్ నుంచి సరఫరా చేస్తున్న తాగునీటికి నిర్వహిస్తున్న క్లోరిన్ పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సరఫరాచేస్తున్న తాగునీటిని అన్ని ప్రాంతాల్లో శాంపిల్స్ తీసి పరీక్షలు నిర్వహించి, ఫలితాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, నిర్దేశించినవిధంగా ఫలితాలు లేకపోతే వెంటనే సంబంధిత అధికారుల దష్టికి తీసుకువచ్చి చర్యలు తీసుకోవాలన్నారు. పైపులైను వాల్ పిట్ వద్ద నీరు నిల్వ ఉండ కుండా చర్యలు తీసుకోవాలని, వాల్ పిట్‌లో నీరు ఉంటే తీసివేసి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తాగునీటి పైప్‌లైన్ల లీకులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేయాలన్నారు. పైపులైన్ల మరమ్మతులు, తాగునీటి సరఫరా నిలిపివేత, పునరుద్ధరణ విషయంపై ప్రజలకు పూర్తి స్థాయిలో సమాచారం ఉండాలన్నారు. అలాగే ఆ సమయంలో ఆయా ప్రాంతాలకు ట్యాంకుల ద్వారా తాగు నీటిని సరఫరా చేయాలన్నారు. శారదాకాలనీలో ఇటీవల వాంతులు, విరోచనాలు లక్షణాలతో చికిత్స చేయించుకున్న వారి వివరాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అనారోగ్య లక్షణాలు ఉన్న వారిని ప్రాథమిక దశలోనే సమీపంలోని ప్రత్యేక మెడికల్ క్యాంప్ లేదా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సంప్రదించి వైద్యసేవలు పొందాలని పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. శ్రీనగర్ 7వ లైనులోని వాటర్ ప్లాంట్ నిర్వహణ సక్రమంగా లేదని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటర్‌ప్లాంట్‌ను తనిఖీచేసి చర్యలు తీసుకోవాలని ఫుడ్ కంట్రోలర్, కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ప్రజలు త్రాగునీటి పై ఏ సమస్య ఉన్నా గుంటూరు నగరపాలక సంస్థ కంట్రోల్ రూమ్ 90000 02109 నంబర్‌కి ఫోన్ చేస్తే తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ లక్ష్మీ, జీఎంసీ ఎస్‌ఈ సుందరరామిరెడ్డి, సీఎంహెచ్‌వె డాక్టర్ ఆషా ఎంహెచ్‌వో మదుసూదన్, తూర్పునియోజకవర్గ తహసీల్దారు నగేష్, వైద్యారోగ్యశాఖ, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

రాజధాని అమరావతికి పూర్వ వైభవం తెస్తాం

● టీడీపీ గుంటూరు తూర్పు ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్



నాజ్ థియేటర్ వద్ద రాజధాని ఫైల్స్ పోస్టర్‌తో నసీర్, టీడీపీ నేతలు

గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు సారథ్యంలో రాజధాని అమరావతికి పూర్వ వైభవం తీసుకువస్తామని టీడీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ అన్నారు. స్థానిక నాజ్ థియేటర్లో ప్రదర్శిస్తున్న 'రాజధాని ఫైల్స్' సినిమాను టీడీపీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాజధానికోసం గత సీఎం చంద్రబాబు పిలుపుమేరకు ఆయనను నమ్మి రైతులు 34 వేల ఎకరాలను త్యాగం చేశారన్నారు. నాడు చంద్రబాబునాయుడు రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధిపథంలో నడిపితే, అమరావతి రాజధాని అనుకూలం అని చెప్పి మాయమాటలతో, దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాటలాడుతూ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశాడ న్నారు. రాజధాని ఏది అంటే చెప్పుకోలేని పరిస్థితికి ప్రజలను నెటట్టారని, అందుకు కారణం ఈ సైకో సీఎం జగన్ రెడ్డేనని ఆరోపిం చారు. రాష్ట్రాన్ని, రాజధానిని కాపాడుకోవడం కోసం అమరావతి రైతులు గత ఐదు సంవత్సరాలుగా నిరసనను కొనసాగిస్తూనే ఉన్నారని, వారి పోరాటం శ్లాఘనీయమని అన్నారు. మరో 60 రోజుల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని, మళ్లీ రాజధాని అమరావతికి పూర్వ వైభవం వస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జాగర్లమూడి శ్రీనివాసరావు, కొనకళ్ల సత్యం, ఆనంద్, అన్వర్, కిరణ్, వాణి, జబి, సురేశ్రీనివాస్, చిలక వెంకటేశ్వర్లు, ఉస్మాన్ లోకేశ్వరి, అరవపల్లి శ్రీను, బాబు, ఇమ్రాన్, బద్రి, శంకర్, తదితరులు ఆయనతో పాటు సినిమాను వీక్షించారు.

'ఆరోగ్యశ్రీ' మరింత బలోపేతం చేయాలి

● ఆరోగ్య శాఖ మంత్రి రజినికి, నరేంద్రరెడ్డి విజ్ఞప్తి




మంత్రి రజినికి బొకే అందిస్తున్న డాక్టర్ నరేంద్ర రెడ్డి

గుంటూరు (మెడికల్) ఫిబ్రవరి 18: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేయాలని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం శ్యామలా నగర్‌లోని డాక్టర్ నరేంద్ర రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు మంత్రి రజిని హాజరయ్యారు. డాక్టర్ నరేంద్ర రెడ్డి, ఆయన భార్య, గైనకాలజిస్ట్ డాక్టర్ దీప్తిరెడ్డి మంత్రికి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రైవేటు హాస్పిటల్ యాజమాన్యాలు సిద్ధంగానే ఉన్నాయని, ఇదే సమయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ ఆర్.సీతా రామాంజనేయులు, ఏపీ టెక్స్ టైల్స్ అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షుడు బీ. మల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూపూడి ప్రభాకర్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి18: విదేశీవిద్య పథకానికి అంబేద్కర్ పేరు తొలగించి జగన్ మోహన్‌రెడ్డి పేరు పెట్టాలని జూపూడి ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటు అని టీడీపీ రాష్ట్ర నేత కొర్రపాటి సురేష్ మండిపడ్డారు. అంబేద్కర్ వారసుల మనోభావాలను కించపరిచేలా జూపూడి వ్యాఖ్యలున్నాయాని, పదవులకోసం దిగజారి మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే జూపూడి ప్రభాకర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



తారకరత్న చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

టీడీపీ శ్రేణుల గుండెల్లో నిలిచిపోయిన తారకరత్న

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో టీడీపీ అభివృద్ధికి ఎనలేని సేవలందించిన సినీనటుడు నందమూరి తారకరత్న కార్యకర్తల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. తారకరత్న ప్రథమ వర్ధంతి సందర్భంగా విద్యానగర్‌లోని పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అడకా శ్రీనివాసరావు, కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, లంకాఉదయ్, కిరణ్‌కుమార్, రాధాకృష్ణ, అస్మతుల్లా, రాబ్బాని, సుందరరావు, డేవిడ్‌బాబు తదితరులు పాలొన్నారు.

ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమైతే కొలువు సొంతం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి18: గ్రూప్-2 అభ్యర్థులు ప్రణాళికబద్ధంగా చదివితే ప్రభుత్వ కొలువు సొంతం చేసుకోవచ్చని ఎమ్మెల్సీ కే ఎస్ లక్ష్మణరావు సూచించారు. ఆదివారం ఏసీ కళాశాలలో డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గ్రూప్-2 అభ్యర్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా 'భారత సమాజం' 'ఆంధ్రుల చరిత్ర-ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ' పుస్తకాల్ని ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ.మోజేష్, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావులు ఆవిష్కరించి, అభ్యర్థులకు అందజేశారు. అనంతరం 25న జరిగే ఫిలిమ్స్ పరీక్షకు సంబంధించి వివిధ అంశాలపై లక్ష్మణరావు వివరించారు. కార్యక్రమంలో ఏఎమ్.కిరణ్, కె.అనురాధ, కాకుమాను నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి18: స్థానిక బ్రాడీపేట, తాలుకా ఆవరణ, శ్రీనివాసభవనంలో ఆదివారం 4వతరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలను సంఘ రాష్ట్ర కోశాధికారి ఆర్.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. జిల్లా అధ్యక్షులుగా ఎస్.కొండయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా జే.రవికుమార్, ఉపాధ్యక్షులుగా టి.రమేష్, సీ.సాంబయ్య, కార్యదర్శిగా కే.పవన్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా జీ.హనుమంతురావు, కే.మస్తాన్‌రావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్.రమేష్‌బాబు, కోశాధికారిగా ఆర్.వెంకమ్మ ఎన్నికయ్యారు. అనంతరం సంఘ రాష్ట్ర కోశాధికారి ఆర్ శ్రీనివాసరావు ఎన్నికైన సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.

టీడీపీలోకి తాడిశెట్టి సోదరులు

● అనుయాయులతో నేడు గుంటూరులో ఆత్మీయ సమావేశం



తాడిశెట్టి సోదరులు వెంకట్రావు, మురళి

గుంటూరు,ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకట్రావు, ఆయన సోదరు మురళీమోహన్ టీడీపీలోకి చేరేందుకు సిద్ధమయ్యారు. వైసీపీ ప్రభుత్వ పెద్దల తీరుపై కొన్ని నెలల నుంచి తీవ్ర అసంతృప్తితో ఉన్న ఇద్దరు నేతలు ఆపార్టీకి గుడ్ బై చెప్పాలని నిర్ణయం తీసుకొన్నారు. సొంత అనుచరులతో సోమవారం గుంటూరు రింగురోడ్డులోని శుభం కన్వెన్షన్ హాల్లో సమావేశమై కార్యకర్తల అభీష్టం మేరకు టీడీపీతో కలిసి నడిచేందుకు ఒక నిర్ణయానికి వచ్చారు. ఎలాంటి పదవులు ఆశించకుండా ఐదేళ్లపాటు వైసీపీ కోసం కష్టపడినా ఆపార్టీలో కనీస ప్రాధాన్యం దక్కకపోవ డంపై తాడిశెట్టి సోదరులు గుర్రుగా ఉన్నారు. ముఖ్యంగా వైసీపీ అధినేత, సీఎం జగన్ తీరుపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పరిస్థితి గురించి కలిసి చెప్పేందుకు అనేకసార్లు ప్రయత్నించినా కనీసం అపాయింట్ మెంట్ ఇవ్వకపోవడంపై రుసరుసలాడుతున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్‌కి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని చెబుతున్నారు.

తాడిశెట్టి సోదరులు ఎన్‌ఎస్‌యూఐ నుంచి అంచెలంచెలుగా కాంగ్రెస్ పార్టీలో ఎదిగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా తాడిశెట్టి వెంకటరావు బాధ్యతలు నిర్వహించారు. 2004లో వెంకటరావుకు గుంటూరు పశ్చిమ టిక్కెట్ సాధించి ముక్కోణపు పోటీలో 17 వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. అది మొదలుకొని 2009 వరకు గుంటూరునగరంలో వారి హవా కొనసాగింది. మరోవైపు నగర డిప్యూటీ మేయర్‌గా వెంకటరావు సోదరుడు తాడిశెట్టి మురళీమోహన్ రెండున్నర సంవత్సరాలు కొనసాగారు. అప్పటి సీఎం వైఎస్‌తో సన్నిహిత సంబంధాలు ఉండేవి. కాగా 2019కి ముందు తాడిశెట్టి మురళీమోహన్, ఆయన సతీమణి జగన్ విజ్ఞప్తి మేరకు వైసీపీలో చేరి ఆ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల కోసం కష్టపడి పని చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తగిన గుర్తింపు ఇస్తుందని భావించారు. మునిసిపల్ ఎన్నికలు, నామినేటెడ్ పదవుల నియామకంలోనూ తాడిశెట్టి సోదరులకు జగన్ మొండిచెయ్యి చూపించారు. ఈ నేపథ్యంలో అనుచరుల అభీష్టం మేరకు వైసీపీకి ఒక నమస్కారం పెట్టి బీసీలకు గుర్తింపు ఇస్తున్న టీడీపీలో చేరాలని నిర్ణయం తీసుకొన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు శుభం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఆత్మీయ సమావేశానికి అందరూ తరలిరావాలని వారు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా విజయ గణపతి రథోత్సవం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి18: స్థానిక ఎస్వీఎన్ కాలనీ విజయ గణపతి స్వామి ఆలయ 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం విశ్వక్సేన పూజ, నిత్య హోమము, గణపతి హోమం తిరువంజనసేవ, మూలవిరాట్‌కు విశేష అభిషేకము, తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి దివ్య రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.

నేటి నుంచి ద్వావింశతి వార్షిక బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి18: స్థానిక గోరంట్ల, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన సొసైటీ ఆధ్వర్యంలో నేటి నుంచి నాలుగు రోజులు పాటు ద్వావింశతి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని సొసైటీ అధ్యక్షులు గజ్వేలు అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అలరించిన భక్తి రంజని

గుంటూరు(తూర్పు),ఫిబ్రవరి18: నల్లచెరువు కోదండరామాలయ ప్రాంగణంలో 9వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాల సందర్భంగా స్వరరాగసుధ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భక్తి రంజని ప్రేక్షకులను అలరించింది. గాయకులు శాయిబాబాశర్మ, కృష్ణకుమారి, సాంబశివరావులు భక్తి గీతాలను ఆలపించారు. ఎం.రామకృష్ణ, షణ్ముఖశర్మ వాయిద్య సహకారం అందించారు.

దిక్సూచి DIKSUCHI

భారతదేశంలోనే ఉన్నత ఉద్యోగాలైన ఐఏఎస్, ఐపీఎస్ తదితర కీలక సర్వీసులకి సంబంధించి 1056 పోస్టులకుగాను సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్‌ను యూపీఎస్సీ విడుదల చేసింది. నిర్ణీత వయోపరిమితి, బ్యాచిలర్స్ డిగ్రీ ఉన్న అభ్యర్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. జనరల్ అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితి 32 సంవత్సరాలు. ఆరు సార్లు ఈ పరీక్ష రాయవచ్చు. రిజర్వుడు వర్గాలకు వయస్సు, అటెంప్టుల విషయంలో నిబంధనల మేరకు సడలింపు ఉంటుంది.

సివిల్స్ ప్రిలిమ్స్ ప్రిపరేషన్

తొలి మెట్టు నుంచే పట్టు సాధించాలి

సివిల్ సర్వీసెస్ పరీక్షను మూడు అంచెలలో నిర్వహిస్తారు. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్, ఇంటర్వ్యూ అనే మూడు దశల ద్వారా నిర్వహణ ప్రక్రియ ఉంటుంది. ప్రిలిమినరీ పరీక్ష ఈ ఏడాది మే 26న నిర్వహిస్తున్నారు.

మెయిన్స్‌కు నిగ్గుతేల్చే పరీక్ష


ప్రిలిమినరీ(ప్రాథమిక) పరీక్షను అర్హత పరీక్షగానే పరిగణించాలి. ఈ మార్కులను మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు మాత్రమే పరగణనలోకి తీసుకుంటారు. ఇది ఆబ్జెక్టివ్ రూపంలో నిర్వహించే పరీక్ష. ప్రిలిమినరీ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కొక్క పేపరు 200 మార్కులకి ఉంటుంది. ఇందులో నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. అందువల్ల విద్యార్థి జాగ్రత్తగా వ్యవహరించాలి. మొదటి పేపర్ జనరల్ స్టడీస్‌కి సంబంధించింది. దీనిలో 100 ప్రశ్నలకు 200 మార్కులు ఉంటాయి. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా మెయిన్స్ పరీక్షకి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

జనరల్ స్టడీస్

ప్రధానంగా భారతదేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, భారతదేశ - ప్రపంచ భౌగోళిక శాస్త్ర అంశాలు; పాలిటీలో భారత రాజ్యాంగం, పరిపాలన, పంచాయతీ రాజ్ వ్యవస్థ; ఎకానమీలో సుస్థిరాభివృద్ధి, పేదరికం, బడ్జెట్, ద్రవ్య విధానం - కోశ విధానం; సైన్స్ అండ్ టెక్నాలజీలో స్పేస్ టెక్నాలజీ, ఐటీ, రోబోటిక్స్, డిఫెన్స్, కమ్యూనికేషన్స్‌కు తోడు వర్తమాన అభివృద్ధి; పర్యావరణంలో సంబంధిత అంశాలు, జనరల్ సైన్స్ అలాగే వర్తమాన జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ప్రశ్నలు ఉంటాయి.

గత సంవత్సరం(2023) పరీక్ష పేపరును పరిశీలిస్తే సబ్జెక్టుల వారీగా మార్కులు ఇలా ఉన్నాయి.

- చరిత్ర(14)
- జాగ్రఫీ(16)
- పాలిటీ(15)
- ఎకానమీ(14)
- పర్యావరణం(14)
- కరెంట్ అఫైర్స్(15)
- సైన్స్ అండ్ టెక్నాలజీ(12)



చరిత్ర

చరిత్రకు సంబంధించి 2012 నుంచి 2023 వరకు ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే అత్యల్పంగా 2017, 2023లలో 14; అత్యధికంగా 2014లో 22 ప్రశ్నలు వచ్చాయి. చరిత్రలో ప్రాచీన, మధ్య యుగ, ఆధునిక భారతదేశ చరిత్రతోపాటు కళలు - సంస్కృతి (ఆర్ట్ అండ్ కల్చర్)కి సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. చరిత్ర విషయంలో ప్రాథమిక అంశాలు బాగా చదవాలి. 75 వసంతాల భారతదేశంలో 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'పై తప్పనిసరిగా ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ప్రాచీన భారత చరిత్ర విషయానికి వస్తే ముఖ్యంగా ఇటీవలి కాలంలో సింధు నాగరికతకి సంబంధించిన కట్టడాలు తవ్వకాలలో బయట పడ్డాయి. దీనికి సంబంధించి ప్రశ్న వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత తవ్వకాలలో బయల్పడిన కట్టడం గురించి అయినా అడగవచ్చు లేదా సింధు నాగరికత పట్టణాలకి సంబంధించి ఏ అంశం అయినా అడగవచ్చు. అందువల్ల ఈ విషయంలో పూర్తిగా చదివితే పరీక్షలో సులభంగా సమాధానాన్ని గుర్తించవచ్చు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, దయానంద సరస్వతి వంటి ప్రముఖులపై ఇటీవలి కాలంలో దిన పత్రికలలో వార్తలు బాగా వస్తున్నాయి. వీరిపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది.

చరిత్ర కోసం 6, 7, 8, 12వ తరగతి నూతన ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలతోపాటు ప్రాచీన భారతదేశ చరిత్ర(ఆర్.ఎస్. శర్మ), మధ్యయుగ భారతదేశ చరిత్ర(సతీష్ చంద్ర), ఆధునిక భారతదేశ చరిత్ర(బిపిన్ చంద్ర), స్వాతంత్ర్యోద్యమ చరిత్ర(బిపిన్ చంద్ర) పుస్తకాలు చదివితే సబ్జెక్టుపై సమగ్ర అవగాహన వస్తుంది. ఇవి చదివితే 60 నుంచి 70 శాతం మార్కులు సాధించినట్లే. వీటితోపాటు టాటా మెగ్రాహెల్, స్పెక్ట్రమ్, సివిల్ సర్వీసెస్ క్రానికల్ వంటి సంస్థలకి సంబంధించి ఏదైనా ఒక స్టాండర్డ్ పుస్తకాన్ని ఆసాంతం చదివితే సరిపోతుంది.

2023లో చరిత్ర నుంచి అడిగిన ప్రశ్నలు (ఉదాహరణకు):

- **మహాసాంఘిక ఆధ్వర్యంలో, ప్రముఖ బౌద్ధ కేంద్రంగా విలసిల్లిన ధాన్యకటకం కింది ప్రాంతాల్లో ఎక్కడ ఉంది?**

ఎ) ఆంధ్ర బి) గాంధార సి) కళింగ డి) మగధ

కటాఫ్

2022 ప్రిలిమ్స్ పేపర్ కట్ ఆఫ్ మార్కులు పరిశీలిస్తే 200 మార్కులకిగాను జనరల్ అభ్యర్థులు 88.22 మార్కులు, ఈడబ్ల్యూఎస్ -82.83, ఓబీసీ-87.54, ఎస్సీ-74.08, ఎస్టీ-69.35, దివ్యాంగుల కేటగిరి 1 - 49.84, కేటగిరి 2 - 58.59, కేటగిరి 3 - 40.40, కేటగిరి5 - 41.76 వచ్చాయి. ఈ మార్కులకి అటు ఇటుగా 5 మార్కులు అంచనా వేసుకుని ముందస్తు ప్రణాళిక చేసుకుంటే ఎవరికైనా మెయిన్స్‌కు మార్గం సుగమం అవుతుంది.

- **ప్రాచీన దక్షిణ భారతదేశానికి సంబంధించి, కొర్కై, పూంపుహార్, ముచిరి అనేవి ఏ విధంగా ప్రసిద్ధి చెందాయి?**

ఎ) రాజధాని నగరాలు బి) ఓడరేవులు
సి) ఇనుము-ఉక్కు తయారీ కేంద్రాలు
డి) జైన తీర్థంకరుల పుణ్యక్షేత్రాలు



జాగ్రఫీ

దీనిలో అత్యల్పంగా 2016లో 7 ప్రశ్నలు రాగా, అత్యధికంగా 2013లో 18 ప్రశ్నలు వచ్చాయి. జాగ్రఫీలో భారతదేశ భౌగోళిక పరిస్థితులేగాక ప్రపంచ భౌగోళానికి సంబంధించిన అంశాలను చదవాలి. అయితే భౌతిక భౌగోళిక అంశాలపై ప్రధానంగా ప్రశ్నలు వస్తాయి. ఉదాహరణకి టోంగా అగ్నిపర్వతం గురించి ఇటీవల వార్తలు వచ్చాయి. టోంగా అగ్నిపర్వతం గురించి ప్రత్యేకంగా చదవాలి. అదే సమయంలో అగ్నిపర్వతం(ఓల్కనో) రకాలు, అవి ఏర్పడటానికి కారణాలు, ఎక్కడెక్కడ ఉన్నాయి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఇటీవలి కాలంలో తరచూ నదుల అనుసంధానం ప్రస్తావన వచ్చింది. కెన్-బెట్వా అనుసంధానం గురించి చదవాలి. అలాగే నదులు, వాటి ఉపనదులను మ్యాప్ సహాయంతో నేర్చుకోవాలి. ఫారెస్ట్ రిపోర్ట్ 2021 ప్రకారం అడవుల విస్తీర్ణం పెరిగింది. అడవుల రకాలు,

విస్తీర్ణం ఏ రాష్ట్రాలలో ఏవిధంగా ఉంది సమగ్రంగా చదవాలి. మడ అడవులను అధ్యయనం చేయాలి. ఇండియాకి సంబంధించి రామ్సర్ సైట్స్ 80కి చేరాయి. చిత్తడి నేలలు అంటే ఏమిటో, ఎక్కడెక్కడ ఉన్నాయో చదువుకోవాలి. ప్రతి సంవత్సరం ఏదైనా ఒక సముద్రం సరిహద్దులను పరీక్షలో ఇస్తున్నారు. ఈ సంవత్సరం నల్లసముద్రం, ఎర్ర సముద్రం తరచూ వార్తల్లో నిలిచాయి. వాటి చుట్టుపక్కల ప్రాంతాలు, జలసంధులపై ప్రశ్నలు అడగవచ్చు. వార్తల్లో నిలిచిన వివాదాస్పద ప్రాంతాలు పాలస్తీనా - ఇజ్రాయెల్; నగోర్నో కారాబాగ్, హెల్మండ్ నది వివాదం వంటివి పరిశీలించండి. వివిధ దేశాల సరిహద్దులు, సమగ్ర సరిహద్దులు మ్యాప్ పాయింటింగ్ ద్వారా చదువుకోవాలి. జాగ్రఫీకి సంబంధించి 6-12 ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్ బాగా చదివితే సరిపోతుంది. వీటితోపాటు ఏదైనా ఒక స్టాండర్డ్ బుక్ చదివితే మంచిది.

పాలిటీ

ఇందులో అంతర్జాతీయ అంశాలకు సంబంధించి అత్యల్పంగా 2016లో 7 ప్రశ్నలు, అత్యధికంగా 2017లో 22 ప్రశ్నలు వచ్చాయి. పాలిటీలో భారత రాజ్యాంగంలోని అంశాలకు వర్తమాన విషయాలు జోడించి చదవాలి. ఉదాహరణకు దేశంలో గవర్నర్ వ్యవస్థ వివాదాస్పదం అవుతోంది కాబట్టి దానిపై ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నిక, కొలిజియం వ్యవస్థ, కేంద్ర ఎన్నికల సంఘం-కమిషనర్ల నియామకం- సుప్రీం కోర్టు తీర్పు, ఎన్నికల సంస్కరణలు, ఎలక్టోరల్ బాండ్స్ - సుప్రీం తీర్పు, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్స్ - సుప్రీం కోర్టు తీర్పు, భారత రాజ్యాంగం, దానిలోని మౌలికాంశాలు, కేశవానంద భారతి కేసు వంటి వాటితో పాటు, రాజ్యాంగంలోని అంశాలు ఎక్కడ నుంచి తీసుకున్నారు వంటి అంశాలు చదవాలి. పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బిల్లుల గురించి చదవాలి. సుప్రీంకోర్టు, హైకోర్టులు ఇచ్చిన వివిధ ముఖ్యమైన తీర్పులు చదవాలి. వివిధ కమిటీల రిపోర్ట్‌లు చదవాలి. 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, మహిళ వివాహ వయస్సుకి సంబంధించిన అంశాలతోపాటు వారికి సంబంధించిన హక్కులు చదవాలి. ఓబీసీ జాబితాకి చేసిన రాజ్యాంగ సవరణ బిల్లుతోపాటు ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన రాజ్యాంగ ఆర్టికల్స్, వారికి సంబంధించిన కమిషన్ల గురించి చదవాలి.

2023లో పాలిటీలో అడిగిన ప్రశ్నలు (ఉదాహరణకు)

సిశాట్

ప్రిలిమ్స్‌లో రెండో పేపర్ సిశాట్ 200 మార్కులకిగాను 80 ప్రశ్నలతో నిర్వహిస్తారు. ఈ పేపర్ క్వాలిఫైయింగ్ పేపర్ మాత్రమే. ఈ పేపర్‌లో 33 శాతం మార్కులు సాధించాలి.

ఈ పేపర్‌లో సాధారణ న్యూమరసీ, అర్థమెటిక్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, గ్రాఫ్స్, టేబుల్స్‌కి సంబంధించి పదో తరగతి పరిజ్ఞానం సరిపోతుంది. ఇంగ్లిష్ ప్యాసేజ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి.

రీజనింగ్, అర్థమెటిక్‌కు సంబంధించి చాంద్ బుక్స్ లేదా, అరిహంట్ బుక్స్ గానీ చదవాలి. ఇంగ్లిష్ పాసేజ్‌కి సంబంధించి టాటా మెగ్రాహిల్ లేదా అరిహంట్ లేదా పియర్సన్ బుక్స్ చదవాలి.

ప్రిలిమినరీ పరీక్షకి చదువుతూనే మెయిన్స్ సంబంధించి కూడా చరిత్ర, భౌగోళిక శాస్త్రం, ఎకానమీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ, పాలిటీలను అనుసంధానం చేసుకుంటూ వెళ్ళాలి. తద్వారా మెయిన్స్‌కి ప్రిలిమ్స్ తరవాత చదవడం కూడా సులభతరమవుతుంది.

- **'డ్యూ ప్రాసెస్ ఆఫ్ లా' అంటే ఏమిటి?**

ఎ) సహజ న్యాయ సూత్రం
బి) చట్టం ద్వారా ఏర్పాటు చేసిన విధానం
సి) న్యాయమైన చట్టం దరఖాస్తు
డి) చట్టం ముందు సమానత్వం

- **కింది వాటిలో ఏది దేశ రాజ్యాంగం ముఖ్య ఉద్దేశాన్ని ప్రతిబింబిస్తుంది?**

ఎ) అవసరమైన చట్టాలను రూపొందించడానికి ఇది లక్ష్యాన్ని నిర్ణయిస్తుంది. బి) ఇది రాజకీయ కార్యాలయాలు, ప్రభుత్వాన్ని సృష్టించడానికి వీలు కల్పిస్తుంది.
సి) ఇది ప్రభుత్వ అధికారాలను నిర్వచిస్తుంది, పరిమితం చేస్తుంది.
డి) ఇది సామాజిక న్యాయం, సామాజిక సమానత్వం, సామాజిక భద్రతను కల్పిస్తుంది.

పాలిటీ విషయంలో ఎన్‌సీఈఆర్‌టీ ప్రచురించిన ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ ఎట్ వర్క్ అనే 11వ తరగతి పుస్తకం చదవాలి. ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ పుస్తకంతో పాటు లక్ష్మీకాంత్ ఇండియన్ పాలిటీ లాంటి స్టాండర్డ్ బుక్ ఏదైనా ఒకటి చదవాలి. పాలిటీ చదివేటప్పుడు ముఖ్యంగా వర్తమాన అంశాలు కలుపుకొని బాగా చదవాలి. రాజ్యాంగ ప్రకరణలపై అవగాహన రావాలి.

జనరల్ సైన్స్

శాస్త్ర సాంకేతికతకి సంబంధించి 2019లో 7 అత్యల్పంగా, 2014లో అత్యధికంగా 16 ప్రశ్నలు వచ్చాయి. జనరల్ సైన్స్‌లో వ్యాధులు, విటమిన్‌లు, వృక్ష, జంతువులకి చెందిన సాధారణ అంశాలు ముఖ్యం. సైన్స్ అండ్ టెక్నాలజీలో కమ్యూనికేషన్స్, స్పేస్, ఐటీ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, డిఫెన్స్ వంటి అంశాల్లో నూతన ఆవిష్కరణలు, సమకాలీన డెవలప్‌మెంట్స్ పైన ప్రశ్నలు అధికంగా వస్తాయి. ఇటీవలి కాలంలో భారతదేశంతోపాటు ఇతర దేశాల అంతరిక్ష ప్రయోగాల గురించి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఈసారి చంద్రయాన్-3, ఆదిత్య ఎల్1 ప్రయోగం తదితరాలపై కచ్చితంగా చదవాలి. వార్తల్లో నిలిచిన వ్యాధులు - సంక్రమణ, నివారణ చర్యల గురించి చదవాలి.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

22,400 పైన క్లోజయితే బుల్లిష్

(ఫిబ్రవరి 19-23 తేదీల మధ్య వారానికి)

టెక్ వ్యూ



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 22,069-21,530 పాయింట్ల మధ్యన కదలాడి లాభంతో చివరకు 22,041 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 30, 50, 150, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,692, 21,544, 20,261, 19,855 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,450
బ్రేక్‌డౌన్ స్థాయి: 21,650
నిరోధ స్థాయిలు: 22,250, 22,350, 22,450 (22,150 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 21,850, 21,750, 21,650 (21,950 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ		విజయవాడ	542
హైదరాబాద్	554	విశాఖపట్నం	555
19వ తేదీ		వరంగల్	556
చిత్తూరు	603		
గోదావరి	542	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	134
వరంగల్	130	గుంటూరు	135
కరీంనగర్	130	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	135
కర్నూలు	130	నెల్లూరు	135
విశాఖపట్నం	122	అనంతపురం	134
గోదావరి	134		

ప్రభుత్వ పెట్టుబడులే చాలవు

- ప్రైవేట్ పెట్టుబడులూ పెరగాలి
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ సుబ్బారావు



న్యూఢిల్లీ: ప్రైవేట్ పెట్టుబడులు ఇంకా పుంజుకోకపోవడంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెట్టుబడులకు ప్రైవేట్ పెట్టుబడులు కూడా తోడైతేనే 6.5 శాతం నుంచి 7 శాతం జీడీపీ వృద్ధి రేటు సాధ్యమవుతుందని ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. 'ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనపై పెట్టుబడి పెట్టడం సానుకూల అంశమే. ఇది ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాల వృద్ధికి దోహదం చేస్తుంది. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరం కల్లా ద్రవ్య లోటును జీడీపీలో 4.5 శాతం వద్ద కట్టడి చేయాలంటే ఈ స్థాయిలో ప్రభుత్వ పెట్టుబడులు కొనసాగించడం కష్టమవుతుంది' అన్నారు. ప్రైవేట్ పెట్టుబడులతో పాటు ప్రస్తుతం వినియోగం, ఎగుమతుల అవకాశాలూ అంతంత మాత్రంగానే ఉన్నట్టు సుబ్బారావు చెప్పారు.

చాయిస్‌లు తక్కువే: ప్రభుత్వ పెట్టుబడులు తగ్గించేందుకు ప్రభుత్వం ముందున్న చాయిస్‌లూ తక్కువేనని సుబ్బారావు చెప్పారు. ఒకవేళ ముందు ముందు కూడా ప్రభుత్వ పెట్టుబడులు ఇదే స్థాయిలో కొనసాగించాలంటే ఇతర ఖర్చులైనా తగ్గించుకోవాలి లేదా అప్పులైనా తేవాల్సి ఉంటుందన్నారు. స్వల్పకాలంలో ఇతర ఖర్చులు తగ్గించుకుంటే ఇతర సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని అప్పుల తెచ్చి ప్రభుత్వ పెట్టుబడులు కొనసాగించాలంటే ఎఫ్ఆర్‌బీఎం లక్ష్యాలు దెబ్బతింటాయన్నారు.

వృద్ధిలో అసమతౌల్యం: ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతున్నా, సగం జనాభా ఆదాయాలు అంతంత మాత్రంగానే ఉన్న విషయాన్ని సుబ్బారావు గుర్తు చేశారు. అభివృద్ధి ఫలాలు వీరికి కూడా చేరితే తప్ప వినియోగం పుంజుకోదన్నారు. వీరి ఆదాయం, వినియోగ ఖర్చులు పెరిగితే ప్రైవేట్ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలూ పెరుగుతాయన్నారు. దేశీయ వినియోగ పరిశ్రమ ప్రస్తుతం తన ఉత్పత్తి సామర్థ్యంలో 75 శాతం వినియోగించుకుంటోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు పెట్టుబడులు లోక్‌సభ ఎన్నికల తర్వాత పుంజుకునే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

ఉచితాలు సరికాదు

ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు పోటీ పడి ఇస్తున్న 'ఉచిత హామీ'లపై సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉచితాలపై చేసే ఖర్చులను ప్రజలకు విద్య, ఆరోగ్యం లేదా మౌలిక వసతుల కల్పనపై చేయడం మంచిదన్నారు. ఈ రంగాలపై చేసే ఖర్చులు దీర్ఘకాలంతో దేశ అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. ఓటర్లు కూడా ఉచితాల హేతుబద్ధతను ఆలోచించి ఓటేయ్యాలని కోరారు.

ఈ వృద్ధి రేటు చాలదు

2047 నాటికి మన దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే ప్రస్తుత వృద్ధి రేటు చాలదని సుబ్బారావు స్పష్టం చేశారు. వచ్చే 20 ఏళ్ల పాటు ఏటా సగటున 7.6 శాతం చొప్పున అభివృద్ధి చెందితేనే ఆ లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. వాతావరణ మార్పులు, ప్రపంచీకరణపై వ్యక్తమవుతున్న వ్యతిరేకత, పెరిగిపోతున్న వృద్ధులు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఇందుకు ఆటంకంగా మారే ప్రమాదం ఉందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) కూడా ఇందుకు ప్రతిబంధకం కావచ్చని చెప్పారు. మన దేశ అభివృద్ధి ప్రపంచ అభివృద్ధితో ముడిపడి ఉందనే విషయాన్ని మర్చిపోకూడదన్నారు. ప్రపంచ అభివృద్ధి క్షీణిస్తుంటే, మన దేశం అభివృద్ధిలో పయనిస్తుందని భావించడం వృథా ప్రయాస అని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ స్పష్టం చేశారు.

బిజినెస్



త్వరలో రెండు సెమీకండక్టర్ ప్లాంట్లు

- రూ.వేల కోట్ల పెట్టుబడులు
- కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

న్యూఢిల్లీ: మన దేశంలో త్వరలో రెండు పూర్తి స్థాయి సెమీకండక్టర్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఈ విషయం వెల్లడించారు. ఇందులో ఒక ప్లాంట్‌ను ఇజ్రాయెల్ కేంద్రంగా పని చేసే 'టవర్ సెమీకండక్టర్' కంపెనీ, రెండో ప్లాంట్‌ను టాటా గ్రూప్ ఏర్పాటు చేస్తాయన్నారు. ఈ రెండు ప్లాంట్ల కోసం ఇజ్రాయెల్ కంపెనీ, టాటా గ్రూప్ రూ.వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు చెప్పారు. ఇజ్రాయెల్ కంపెనీ పెట్టుబడులే 800 కోట్ల డాలర్ల (సుమారు రూ.66,400 కోట్లు) వరకు ఉంటుందని చంద్రశేఖర్ తెలిపారు. ఈ రెండు ప్లాంట్లకు అనుబంధంగా అనే చిప్ అసెంబ్లింగ్, ప్యాకేజింగ్ యూనిట్లూ ఏర్పాటవుతాయన్నారు

జూన్‌లోగా అనుమతులు : టవర్ సెమీకండక్టర్, టాటా గ్రూప్ ఇందుకు అవసరమైన అనుమతుల కోసం ఇప్పటికే ప్రభుత్వానికి దరఖాస్తు చేశాయి. వీలైనంత త్వరలో ఈ రెండు ప్రతిపాదనలకు ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల్లోపు ఆమోదం తెలుపుతుందని చంద్రశేఖర్ చెప్పారు. ఒకవేళ ఈ లోపు కుదరకపోయినా లోక్‌సభ ఎన్నికల తర్వాత జూన్‌లోపు అన్ని అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఇజ్రాయెల్, టాటా గ్రూప్ ఏర్పాటు చేసే రెండు సెమీకండక్టర్ ప్లాంట్లలో 65, 40, 28 నానోమీటర్ చిప్స్ తయారవుతాయన్నారు.

- గీతమ్ యూనివర్సిటీ.. ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ ఇనిస్టిట్యూషన్స్ నుంచి రూ.28.87 కోట్ల నిధులను అందుకుంది. నిధులు మంజూరు చేసిన సంస్థల్లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఐసీఎస్ఎస్ఆర్, కేంద్రవిద్యా శాఖ, యూజీసీ-డీఏఈ-సీఎస్ఆర్ తదితర సంస్థలు ఉన్నాయి. గిరిజన సాధికారిత-అనుభవిక పరిశోధన, సైంటిఫిక్ అడ్వాన్స్‌మెంట్, ఇంజనీరింగ్‌లో ఇన్నోవేషన్, అకాడమియా-పారిశ్రామిక రంగ భాగస్వామ్యం వంటి విభాగాల్లో పరిశోధన సహా ఇతరత్రా కార్యకలాపాల కోసం ఈ నిధులను మంజూరు చేశాయి.

- అమెజాన్ ఫ్రెష్.. వేగన్ స్టోర్‌ను ప్రారంభించింది. భారత్‌లో రోజురోజుకు శాఖాహారుల సంఖ్య గణనీయంగా పెరిగిపోతోందని, వారి అవసరాలకు తగ్గట్టుగా ఈ స్టోర్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఈ స్టోర్‌లో పలు రకాలైన ప్లాంట్ ఆధారిత ఉత్పత్తులతో పాటు రెడీ టు యూజ్ ప్రొడక్ట్స్ ఉన్నట్లు తెలిపింది. సో గుడ్, సోఫిట్, ఎపిగమియా, ఆర్ఏడబ్ల్యూ వంటి బ్రాండ్స్.. అమెజాన్ ఫ్రెష్‌లో అందుబాటులో ఉన్నాయి.

ఫార్మా, మెటల్ షేర్లపై కన్నేయండి..!

స్టాక్ రికమండేషన్స్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మరింత కన్సాలిడేషన్‌కు గురికావచ్చు. గత వారం వరుసగా నాలుగు సెషన్లు సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలతో పాటు రిలయన్స్, ఎల్ అండ్ టీ వంటి షేర్లు పెరగటమే ఇందుకు కారణం. దీంతోపాటు ఆటో, బ్యాంకింగ్, ఐటీ రంగాల నుంచి మంచి తోడ్పాటు లభించింది. ఈ వారం ఫార్మా, మెటల్ రంగాల్లో మూమెంటమ్ ఉండే అవకాశం ఉంది. నిఫ్టీ ఫిబ్రవరి ఫ్యూచర్స్ మద్దతు స్థాయిలు 21,900, నిరోధ స్థాయిలు 22,150 వద్ద ఉన్నాయి. నిఫ్టీ 22,200 స్థాయిని అధిగమిస్తేనే బుల్లిష్‌నెస్ వస్తుంది.

పాలీక్యాబ్ ఇండియా: ఈ ఏడాది ఆరంభంలో ఒక్కసారిగా పతనమైన ఈ షేరు ప్రస్తుతం నిలదొక్కుకుంది. షేర్ల కదలికల్లో స్థిరత్వం వచ్చింది. మూడో త్రైమాసిక ఫలితాల తర్వాత స్వల్ప కన్సాలిడేషన్ జరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.4,670 వద్ద క్లోజైంది. ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.4,600/4,650 శ్రేణిలో ప్రవేశించి రూ.5,000/5,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,550 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆల్కెమ్ లేబొరేటరీస్: కొన్ని నెలలుగా ఈ కౌంటర్ జోరు ప్రదర్శిస్తూ వస్తోంది. త్రైమాసిక ఫలితాలు ఆకర్షణీయంగా ఉండటం, డివిడెండ్ ప్రకటించటంతో ఈ నెల మొదటి వారం నుంచి అప్‌ట్రెండ్‌ను కనబరుస్తూ వస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.5,442 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.5,400 ఎగువన ప్రవేశించి రూ.5,770/5,800 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకోవచ్చు. అయితే రూ.5,340 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా కమ్యూనికేషన్స్: గత చివరి నాలుగు సెషన్లలో ఈ షేరు లాభాల్లోనే ముగిసింది. త్రైమాసిక ఫలితాల అనంతరం ఈ కౌంటర్‌లో కొనుగోళ్లు పెరిగాయి. గత శుక్రవారం రూ.1,812 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మూమెంటమ్ ట్రేడర్లు రూ.1,775/1,800 శ్రేణిలో ప్రవేశించి రూ.1,945/2,000 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,750 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: సుదీర్ఘ అప్‌ట్రెండ్ అనంతరం ఈ కౌంటర్ స్వల్ప దిద్దుబాటుకు లోనైంది. త్రైమాసిక ఫలితాల తర్వాత ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.1,508 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,475/1,500 శ్రేణిలో ప్రవేశించి రూ.1,650/1,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,450 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టీవీఎస్ మోటార్స్: రెండేళ్లుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు తాజాగా సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. రెండు నెలలుగా రూ.1,950 స్థాయిలో కన్సాలిడేషన్ జరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.2,138 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,100 శ్రేణిలో ప్రవేశించి రూ.2,350/2,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,050 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

కీలక నిరోధ స్థాయిల్లో పరీక్ష

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కరెక్షన్‌తో ప్రారంభమై ఆ తర్వాత రికవరీ సాధించి తదుపరి 21,500 ఎగువకు వెళ్లింది. చివరకు 22,000 పాయింట్లకు స్వల్ప ఎగువన క్లోజైంది. గత వారం నిఫ్టీ ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయిలైన 22,150 పాయింట్ల చేరువలోకి వెళ్లింది. ఈ స్థాయిల వద్ద నిఫ్టీ పరీక్షను ఎదుర్కొనటం ఇది మూడో సారి. టెక్నికల్‌గా చూస్తే ప్రధాన నిరోధ స్థాయిల వద్ద ఎలాంటి అప్‌సైడ్ బ్రేకౌట్‌ను సూచించటం లేదు. గత శుక్రవారం అమెరికా మార్కెట్లు మైనర్ రియాక్షన్‌ను చవిచూడటంతో భారత మార్కెట్లు అప్రమత్త ట్రెండ్‌ను సూచించే అవకాశం ఉంది. ప్రధాన నిరోధ స్థాయిల వద్ద కొద్ది రోజుల పాటు నిలదొక్కుకుంటేనే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను కనబరుస్తుందో లేదో తెలుస్తుంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌ను కనబరిస్తే 22,150 ఎగువన తదుపరి ప్రధాన నిరోధ స్థాయిలుంటాయి. ప్రస్తుతం నిఫ్టీ ఈ స్థాయిలకు 100 పాయింట్ల దూరంలో ఉంది. గడిచిన రెండు నెలలుగా ఈ స్థాయిల వద్ద నిలదొక్కుకోవటానికి ప్రయత్నం చేస్తూ కరెక్షన్‌లోకి జారుకుంటోంది. ఈ స్థాయి ప్రస్తుతం స్వల్పకాలిక నిరోధ స్థాయిగా ఉంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఈ నిరోధ స్థాయిలకు ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది.

బేరిష్ స్థాయిలు: నిఫ్టీ ఏదైనా అప్రమత్త ట్రెండ్‌ను సూచిస్తే ప్రధాన మానసిక అవధి స్థాయిలైన 22,000 ఎగువన కచ్చితంగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఈ స్థాయిల వద్ద నిలదొక్కుకోలేకపోతే మైనర్ కరెక్షన్‌ను సూచిస్తుంది. తదుపరి స్వల్పకాలిక మద్దతు స్థాయిలు 21,800 దిగువన ఉంటాయి. ఇక్కడ కూడా నిలదొక్కుకోకపోతే మరింత బలహీనతను సూచిస్తుంది. 21,400 కింద ప్రధాన మద్దతు స్థాయిలుంటాయి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా కనిష్ఠ స్థాయిలైన 44,600 వద్ద రికవరీ సాధించి 46,600 వరకు వెళ్లింది. గత శుక్రవారం కరెక్షన్‌ను చవిచూసినా 750 పాయింట్ల లాభంతో 46,380 వద్ద నిలకడగా ముగిసింది. ఈ వారం పాజిటివ్ ట్రెండ్‌ను కనబరిస్తే 46,700 ఎగువన ప్రధాన నిరోధం ఉంటుంది. ఇక్కడ నిలదొక్కుకుంటేనే అప్‌ట్రెండ్‌ను సూచిస్తుంది. తదుపరి ప్రధాన నిరోధం 47,200. ఒకవేళ ప్రస్తుత స్థాయిలైన 46,000 వద్ద నిలదొక్కుకోలేకపోతే అప్రమత్తతను సూచిస్తుంది.

పాటర్న్: మార్కెట్ గత రెండు నెలలుగా దీర్ఘచతురస్రాకార ప్యాటర్న్‌లో నిలిచిపోయింది. 22150 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. దీన్ని బ్రేక్ చేస్తేనే తదుపరి అప్‌ట్రెండ్‌ను కనబరుస్తుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,080, 22,150
మద్దతు	21,940, 21,850

www.sundartrends.in

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు


పేదలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శారద

సర్వీస్ సోసైటీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 18: స్థానిక మార్కెట్ సెంటర్‌లోని అన్నాబత్తుని సద్యనారాయణ పుర వేదిక వద్ద ఆదివారం డీ-3 సర్వీస్ సోసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ డీ.శారద పేదలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. ఆ ప్రాంతంలో ఆరోగ్య నిలిపి ఆ ప్రాంత పేదలకు ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శారద మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవితంలో ప్రజలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, వ్యాధి ముదిరాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా రోజువారి కూలీలు, చిరు వ్యాపారుల వారి జీవనవిధానంలో ఆరోగ్యంపై శ్రద్ధ తగ్గిందని తెలిపారు. అటువంటి వారి కోసం తెనాలి సబ్ కలెక్టర్ అనుమతితో ధర్మ హెల్త్ వాహనం ద్వారా ఉచిత వైద్యసేవలను అందిస్తున్నామని తెలిపారు. పట్టణంలో మార్కెట్ ఏరియా, రైతు బజార్లు జనసంచారం అధికంగావున్న కూడలి వద్ద ఆరోగ్య వాహనం నిలిపి అవసరమైన వారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్వీస్ సోసైటీ సభ్యులు, వలంటీర్స్ పాల్గొన్నారు.


ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బాలోత్సవంలో నారాకోడూరు విద్యార్థుల ప్రతిభ

చేబ్రోలు, ఫిబ్రవరి18: జిల్లా స్థాయి బాలోత్సవం పిల్లల పండుగలో నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపిన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండులు తెలిపారు. ఆదివారం ప్రతిభ చూపిన విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని పాఠశాలలో ఏర్పాటు చేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు ఏ శ్రీనివాసరావు దర్శకత్వంలో ప్రదర్శించిన 'నమ్మిన బంటు- హాస్య నాటిక తృతీయ స్థానం పొందింది. చిత్రలేఖనంలో షేక్ నజ్మా తృతీయ స్థానం, వ్యాస రచనలో ఎస్ఎల్ నాగ తులసి తృతీయ స్థానం, స్పెల్‌బీ పోటీలలో చిత్రలేఖ ప్రతిభ చూపారు. 9వ తరగతి విద్యార్థుల జానపద నృత్యం ఉత్తమ ప్రదర్శన ప్రశంసను పొందింది. విద్యార్థులకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు బహుమతులు అందచేసి అభినిందిచారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, శ్రీనివాసరావు, పద్మా, సరోజ, రాజ్య లక్ష్మీ, జగదీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

తెనాలి రూరల్, ఫిబ్రవరి 18: అభివృద్ధి కుంటుపడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సన్నగిల్లిన రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ కల్పిస్తూ ముందుకు నడిపే పార్టీ తెలుగుదేశం పార్టీ అని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోపల్లె శ్రీనివాసరరావు అన్నారు. ఆదివారం మండలంలోని కంచెర్లపాలెంలో తెలుగుదేశం పార్టీ, జనసేన ఉమ్మడి మిని మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరరావు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు పూర్తి ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, సంవత్సరానికి మూడు పూర్తి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పేరిట కుటుంబంలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15000, ఇలా పలు రకాల పథకాలను ప్రజలకు వివరించి అధికారం చేపట్టిన వెంటనే వాటిని అమలు చేస్తామని చంద్రబాబు సంతకం చేసిన బాండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల తెలుగుమహిళా అధ్యక్షురాలు కిలారి అనిత, క్రాంతి, నిర్మల పలువురు తెలుగుమహిళలు పాల్గొన్నారు.


ఉంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

శ్రీనివాసునికి ఉంజల్ సేవ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 18 : తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శ్రీభూనీలా సమేత శ్రీనివాసునికి ఆదివారం ఉంజల్ సేవ నిర్వహించారు. ఇటీవల తాలూకా జూనియర్ కళాశాలలో శ్రీవేంకటేశ్వర సప్తాహ వైభవోత్సవ ముగింపు కార్యక్రమాన్ని 16రోజుల వేడుకతో ఘనంగా జరిపించారు. శ్రీవిద్యా పీఠం, శ్రీసాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో శ్రీనివాస గద్యపారాయణ, అన్నమాచార్య కీర్తనలు, గోవిందనామార్చన, మహ మంగళ హారతి జరిపారు. 108 మంది దంపతులకు తాంబూలం అందించారు. రామానుజ జీయర్‌స్వామి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్యక్రమంలో బాలస్వామి, పొత్తూరి ఆదిలక్ష్మీ, విజయలక్ష్మి, మురళీమనోహర్, ముద్దాభక్తుని రమణయ్య, నంబూరు వెంకట కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది చంద్రశేఖర్ మృతి


చంద్రశేఖర్ (ఫైల్)

తెనాలి క్రైం, ఫిబ్రవరి 18 : తెనాలి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, మండల లీగల్ సర్వీసెస్ ప్యానల్ న్యాయవాది కంచర్ల చంద్రశేఖర్ (58) శనివారం రాత్రి స్వగ్రామం కొవెవరంలో అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఈ ప్రాంతంలో పేదల న్యాయవాది పేరుగాంచిన చంద్రశేఖర్ ఆకస్మిక మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేసి మృతదేహం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మందలపు వేణుగోపాలరావు, మాజీ అధ్యక్షుడు విల్సన్, సోలా శంకర్, బార్ అసోసియేషన్ సభ్యులు, హరిదాసు గౌరీశంకర్, మహిళా న్యాయవాదులు పి.జగదీశ్వరాంబ, శ్యామల, పద్మావతి, రాజ్యలక్ష్మి తదితరులున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె కలరు.

కుల, మతాలకతీతంగా సంక్షేమాన్ని అందించాం

● బ్రేక్‌ఫాస్ట్ విత్ ఎమ్మెల్యేలో శివకుమార్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 18: కష్టాల్లో ఉన్న పేదలకు అండగా నిలవాలని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి కుల,మత, రాజకీయాలకు అతీతంగా వాటిని అందించి ప్రజలకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. ఆదివారం బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో బ్రేక్‌ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే శివకుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ప్రతి పక్షాలు అధికారం చేజిక్కించుకునేందుకు పావులు కదుపుతున్నాయని వారి ప్రయత్నాలు తిప్పికొట్టాలని అన్నారు. 13, 26వ వార్డుల కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, బూత్ లెవల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.


బ్రేక్‌ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే శివకుమార్

నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం

శుద్ధపల్లి ఎత్తిపోతల

● నిలిచిపోయిన నిర్మాణం
● ఐదేళ్లుగా ముందుకు కదలని పనులు
● 2 కిలోమీటర్ల మేర చోరీకి గురైన పైపులు
● కన్నెత్తి చూడని నేతలు, అధికారులు
● వినియోగంలోకి వస్తే శుద్ధపల్లికి తాగు, సాగు నీరు


పథకం చుట్టూ పెరుగుతున్న పిచ్చి చెట్లు



పొన్నూరుటౌన్(చేబ్రోలు), ఫిబ్రవరి18: పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది శుద్ధపల్లి ఎత్తిపోతల పథకం. మండల పరిధిలోని శుద్ధపల్లి ఎత్తిపోతల పథకం పనులు ఐదేళ్లుగా నిల్చిపోయి పథక నిర్మాణమే నిరుపయోగంగా మారే పరిస్థితి ఏర్పడింది. వినియోజక వర్గంలో ప్రజల సాగు, తాగు అవసరాలను తీర్చేందుకు గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ నాబార్డ్ సహకారంతో మైక్రో ఇరిగేషన్ శాఖ నుంచి పలు గ్రామాలో ఎత్తిపోత పథకాలకు శ్రీకారం చుట్టారు. చేబ్రోలు మండలంలో శుద్ధపల్లి గ్రామంలో గతంలో మైనింగ్ అధికంగా జరగటంతో భూగర్భజలాలు పూర్తిగా ఇంకిపోయాయి. శుద్ధపల్లి గ్రామానికి ఉన్న ఇబ్బందులను గుర్తించి స్థానికుల విన్నపాల మేరకు నరేంద్ర కుమార్ రూ. 4.65 కోట్ల వ్యయంతో శుద్ధపల్లి ఎత్తిపోత పథకానికి శ్రీకారం చుట్టారు. ఇందులో రూ. 3.86 కోట్లు నాబార్డ్ రుణంగా ఇచ్చింది. 2018 మే నెలలో ప్రారంభమైన్న నిర్మాణం శరవేగంగా 70 శాతం పూర్తి చేసుకుంది. వడ్లమూడి గ్రామం సమీపం నుంచి ప్రవహించే అప్పాపురం మెయిన్ ఛానల్ వద్ద పంప్ హౌస్ నిర్మాణాని చేపట్టారు. ఈ పంప్ హౌస్ నుంచి సుమారు 5 కిలో మీటర్ల మేరకు పైప్‌లైన్లు వేసి కాల్వ నీటిని శుద్ధపల్లి చెరువులోకి ఎత్తిపోయాలన్నది ఈ పథకం ప్రణాళిక. పనులు నిరాటంకంగా సాగుతున్న సమయంలో 2019 సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. దీంతో ఈ పథక నిర్మాణం కుంటు పడింది. అనంతరం రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడటం, పొన్నూరుకు కొత్త పాలకులు వచ్చారు. ఇక వారు ఈ పథక నిర్మాణాని పూర్తిగా మూలన పడేసారు. ఐదేళ్లుగా పథక నిర్మాణం ముందుకు సాగింది లేదు.

చోరుల పాలైన సామగ్రి ...

సుద్ధపల్లి ఎత్తిపోతల పథకం ఐదేళ్లుగా పూర్తి నిర్లక్ష్యానికి గురవటంతో ఈ సామగ్రిపై దొంగల కన్ను పడింది. అత్యంత నాణ్యమైన పైప్‌లను దొంగలు ఎత్తుకువెళ్లి అమ్ముకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 2 కిలోమీటర్ల మేరా పైప్ లైన్లు చోరుల పాలైయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఓ వైసీపీ నాయకుడే స్వయంగా ఈ పైపులను ఎత్తుకువెళ్లి అమ్ముకొన్ని సొమ్ము చేసుకోవటంతో పాటు, కొన్నిటిని స్వంత అవసరాలకు వినియోగించుకున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే పంప్ హౌస్ నిర్మాణం పూర్తి అయ్యిన్నప్పటికి ఆ వైపు కన్నెతి చూడకపోవటంతో భవనం చుట్టూ పిచ్చిచెట్లు పెరిగి శిథిలావస్థకు చేరేలా ఉంది. పంప్ హౌస్‌లో 50 హార్స్ పవర్ కలిగిన మోటార్లు కూడా నిరుపయోగంగా మారే పరిస్థితితులు ఏర్పడ్డాయి. నిర్మాణం పూర్తయి వుంటే సుద్ధపల్లి గ్రామానికి వెయ్యి ఎకరాలకు పైగా సాగు నీరు, గ్రామస్థులకు తాగు నీరు చేకూరి ఉండేదని గ్రామస్థులు వాపోతున్నారు. కేవలం పాలకుల నిర్లక్ష్యం, అక్రమాల కారణంగానే శుద్ధపల్లి ఎత్తిపోతల పథకం పూర్తి కాలేదన్నే ఆరోపణలు ఉన్నాయి.

ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి పూర్తి చేసి ప్రజలకు సాగు, తాగు నీరు అందించాలన్ని వేడుకుంటున్నారు. లేదంటే నాబార్డ్ నిధులు నిరుపయోగంగా మారుతాయని శుద్ధపల్లి వాసులు అంటున్నారు.

ఆలపాటి పెళ్లికానుక అందజేత

తెనాలి రూరల్, ఫిబ్రవరి 18: పట్టణంలోని 8వ వార్డుకు చెందిన మొట్టు వేణుగోపాల్, శేషారత్నం దంపతుల కుమార్తె లక్ష్మీతిరుపతమ్మ వివాహాన్ని పురస్కరించుకుని ఆలపాటి పెండ్లికానుక ద్వారా మంగళసూత్రం, పసుపు, కుంకుమ, గాజులు, చీరలు స్థానిక పార్టీ నాయకుల చేతులమీదుగా అందజేశారు. పట్టణంలోని 3వ వార్డుకు చెందిన గట్టు ఏడుకొండలు, శంకరమ్మ దంపతుల కుమార్తె నాగ జ్యోతివివాహాన్ని పురస్కరించుకుని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంపిన ఆలపాటి పెండ్రికానుక ద్వారా బంగారు ఉంగరం, పసుపు, కుంకుమ, గాజులు చీరలు స్థానిక పార్టీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


బీజేపీ నియామక పదవుల నియామక పత్రాలు అందజేస్తున్న రామకృష్ణ

21 నుండి బీజేపీ ప్రజాపోరు యాత్ర

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 18 : బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 21 నుండి ప్రారభించే ప్రజాపోరు యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాటిబండ్ల రామకృష్ణ కోరారు. నందులపేటలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో కూడా పార్టీని బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. నూతన పట్టణ కమిటీని పట్టణ పార్టీ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు ప్రకటించారు. విజయభాస్కర్‌రెడ్డి, అన్నవరపు వేణు, కుశల్‌రాజ్ జైన్, కనకదుర్గ పాల్గొన్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా శిఖా రవీంద్రబాబు, తుమ్మల సాయి, వీరయ్య, సురేష్‌కుమార్, వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దారా సాయిగుప్తా, కార్యదర్శులుగా శ్రీనివాసరావు, నాగరాజారావు, సీతారామరావు, కోశాధికారిగా రామారావులకు నియామక పత్రాలు అందజేశారు.

కొనసాగుతున్న అన్నక్యాంటీన్ సేవలు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 18: మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ సేవలు కొనసాగుతున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక శివాజిచౌక్ వద్దగల అన్నక్యాంటీన్‌లో కన్నెదార హైమావతి 12వ వర్ధంతి సందర్భంగా భర్త కన్నెదార శ్రీనివాసరావు, కుమారుడు తాతారావుల సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. అలాగే మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో ఎన్నారై విద్యా సంస్థల యాజమాన్యం సహకారంతో ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సోమవరపు సాంబశివరావు, వెనిగళ్ళ శివప్రసాద్, గోగినేని రమేష్, క్రొత్తపల్లి రమేష్, మాదల కోటేశ్వరరావు, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, వెంకటేశ్వరావు, సురేంద్ర పాల్గొన్నారు.

25న హేతువాద అధ్యయన తరగతులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 18: హేతువాద అధ్యయన తరగతులను జయప్రదం చేయాలని ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 25న విజయవాడ ప్రెస్ క్లబ్‌లో అధ్యయన తరగతులు జరుగుతాయని తెలిపారు. మూఢ నమ్మకాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఇందుకోసం ఏర్పాటు చేసిన తరగతులను జయప్రదం చేయాలన్నారు.


ఆహారం పంపిణీ చేస్తున్న నవచైతన్య బీసీ సంక్షేమ సేవా సంఘు సభ్యులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొల్లిపర, ఫిబ్రవరి 18 : మండల కేంద్రం కొల్లిపర ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సబ్ ఇంజనీర్ సత్యన్నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలిపారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపర సబ్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొల్లిపర చివారు గుదిబండివారిపాలెం, కొల్లిపర, కొత్తబొమ్మువానిపాలెం గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

వసతి గృహంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 18: స్థానిక చెంచుపేటలోని బీసీ కళాశాల, బాలికల వసతి గృహంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ నవ చైతన్య బీసీ సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేడిబోయిన గంగా యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంగా యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, మాస్ వ్యవస్థాపకులు సుద్దపల్లి నాగరాజు, బీసీ నాయకులు గంగాదేవి,భిక్షాలు, వసతి గృహ సంక్షేమ అధికారి జి సరోజ, జె మరియదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని సహకార సంఘాలతో

సొసైటీస్ ఆఫ్ ఫెడరేషన్ ఏర్పాటుకు కృషి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 18 : రాష్ట్రంలో అన్ని సహకార సంఘాలతో సొసైటీస్ ఆఫ్ ఫెడరేషన్ ఏర్పాటు ఎంత గానో అవసరమని విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘువేంద్రరావు తెలిపారు. తెనాలి కాకతీయ సొసైటీలో ఆదివారం వివిధ సొసైటీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కాకతీయ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సొసైటీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ అవసరమన్నారు. ఇందుకు సబంధిచిన కృషి కోసం ప్రతినిధులంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతపురం సొసైటీ చైర్మన్ జయచంద్రారెడ్డి, జీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మారౌతు సీతారామయ్య, విశ్రాంత సహకార అధికారి కృష్ణారెడ్డి, పీపుల్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ యల్లారావు, ప్రభాకర్, రామకృష్ణారెడ్డి, కేవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

తెనాలిరూరల్, ఫిబ్రవరి18: మండలలోని కొలకలూరులో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోయిన మక్బూల్, షేక్ ఇబ్రహీంల కుటుంబానికి పూర్వ విద్యార్థులు చేయూత నిచ్చారు. హెల్పింగ్ హ్యాండ్సు 1977-78 బ్యాచ్ విద్యార్థులు బాధితులను పరామర్శించి రూ.70 వేలు ఆర్థికసాయంతో పాటు నూతన వస్త్రాలు అందించారు.

వైభవంగా కనకదుర్గాదేవి

ఆలయ ప్రతిష్ఠామహోత్సవం


పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి, ఎమ్మెల్యే అన్నాబత్తుని



కొల్లిపర, ఫిబ్రవరి 18 : మండల కేంద్రం కొల్లిపర చివారు గుదిబండివారిపాలెంలో ఆదివారం శ్రీకనకదుర్గాదేవి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదపండితులు దివ్య మంగళ శాసనములతో ఉదయం 10.42 గంటలకు శ్రీకనకదుర్గాదేవి అమ్మవారిని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శివకుమార్‌ను,రాజేంద్రప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, గ్రామ పెద్దలు కల్లం వీరారెడ్డి, శ్యామల వెంకటరెడ్డి, గుదిబండి నాగిరెడ్డి, కూరపాటి రవిశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నరేంద్ర కుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన వీరనాయకునిపాలెం వైసీపీ శ్రేణులు

టీడీపీ విజయంతోనే రాష్ట్ర భవిష్యత్తు

● మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్
● టీడీపీలో చేరిన వీరనాయకునిపాలెం గ్రామ వైసీపీ నేతలు

చేబ్రోలు, ఫిబ్రవరి18: టీడీపీ విజయంతోనే రాష్ట్ర భవిష్యత్తు ముడిపడి ఉందన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని వీరనాయకునిపాలెం గ్రామంలో ఆదివారం పలువురు వైసీపీ నాయకులు నరేంద్రకుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన పల్లపాటి నాగమణి, ఉదయరాజు, తోక కొండల రాయుడు, తోక యువరాజు, కృష్ణం మాధవరావు, పెనుమాక గంగాధరరావు, పత్రా రోశయ్య, పెనుమాక మంగయ్య, బలికూర సురేష్, మన్నెం సాంబయ్య, సత్యనారాయణ, పల్లపాటి జోజప్ప, కాసుల కోటయ్య, ఎరాకుల వీరవసంతరావు, కందుల నాగార్జున, ధూళ్ల శ్రీనివాసరావు, బండి వెంకటేశ్వర్లు, తాళ్లూరి బీక్షాలు, దొనకొండ ఏడుకొండలు, గోపి తదితరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనతో ప్రజలు విసిగి వేసారిపోయ్యారన్నారు. నాలుగున్నర ఏళ్లుగా రాష్ట్రం అన్ని రంగాలలో కుంటుపడిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి తిరిగి గాడిన పడాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాడాల్సిన అవశ్యకత ఉందన్నారు. వైసీపీ అరాచకాలతో, దౌర్జన్యాలతో ఇబ్బంది పడిన ప్రజలు ప్రత్యామ్నాయంగా టీడీపీ వైపుచూస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల టీడీపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని స్పష్టం చేసారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన కల్పించాలి

● కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి
● పాల సేకరణపై మండలాధికారులతో సమీక్ష

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు అధిక ప్రయోజనం కల్పించేందుకు జగనన్న పాలవెల్లువ పథకంలో ఏర్పాటుచేసిన పాల కేంద్రాలకే పాలు పోసేలా పాడి రైతులకు అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం కలక్టరేట్ నుంచి ఆయన జిల్లాలో మూడవ విడతలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమం అమలు చేసిన ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో పాల సేకరణపై ప్రత్యేక అధికారుల, ఎంపీడీవోలు, సచివాలయ ఉద్యోగులు, ఏపీ డైయిరీ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లోని పాడి రైతులకు జగనన్న పాల వెల్లువ పథకంలోని పాల కేంద్రాలలో పాలను విక్రయించటం వలన ప్రతి లీటర్‌కు రూ.20 నుంచి రూ.40 వరకు అదనంగా ఆదాయం వస్తుందని వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల ద్వారా అవగాహన కల్పించేలా పంచాయితీ సెక్రటరీలు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పాడి రైతులకు వర్కింగ్ క్యాపిటల్ క్రింద తక్కువ వడ్డీకే రుణాలు, పశువుల దాణా సరఫరా చేసేందుకు ఏపీ డైయిరీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు పాల సేకరణపై సంబంధిత శాఖల అధికారలు పర్యవేక్షించి, మరింత మంది పాడి రైతులకు మేలు కలిగించేలా బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు.


ప్రసంగిస్తున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబాబు

హక్కులను పోరాడి సాధించుకోవాలి

● పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ. చిట్టిబాబు

మంగళగిరి సిటీ, ఫ్రిబవరి 18: నేటి సమాజంలో ప్రజలు తమ హక్కులను పోరాడి సాధించుకోవల్సిందేనని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.చిట్టిబాబు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పౌరహక్కుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా 20వ మహాసభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. హక్కుల సాధనకోసం జరిగే ఉద్యమాలను ప్రజలు బలోపేతం చేయడం వల్లనే తమ జీవితాలను మెరుగుపరుచుకోగలుగుతారని ఆయన చెప్పారు. ఇటీవలి కాలంలో రాష్ట్రంలోనూ, దేశంలోనూ పాలకులు ప్రజల సాధారణ హక్కులను కూడ కాలరాస్తూ ఉద్యమాలను సైతం అణిచివేసేందుకు నిస్సిగ్గుగా ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఈ తరహా ఉన్మాద చర్యలకు పాలకులే పూనుకోవడం దారుణమన్నారు. ఈ సందర్భంలో హక్కుల సాధనకోసం ప్రజలు బలమైన ఉద్యమాలను నడపక తప్పదని చిట్టిబాబు చెప్పారు. భారతదేశం లౌకికదేశమా! అనే అంశమై విప్లవ రచయితల సంఘం సీనియర్ బాధ్యులు సీఎస్ఆర్ ప్రసాద్, మాదకద్రవ్యాలు-యువతపై వాటి ప్రభావం అనే అంశమై అసిస్టెంట్ ప్రొఫెసర్ మధుబాబు ఉపన్యసించారు. సంఘం అధ్యక్షులు వీరేశలింగం అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో పి.మంజుశ్రీ, షేక్ నాగూర్‌వలి, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రభాకర్, ఎన్ నరసింహరావు, వి.పేరయ్య, చిలుకా చంద్రశేఖర్, డాక్టర్ టి రాజారావు, పి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కేంద్ర ప్రభుత్వం దాడులు పాశవికం

● ప్రముఖ పాత్రికేయులు పాలగుమ్మి.సాయినాథ్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 18: కనీస మద్దతు ధరలు కోరుతూ ఢిల్లీ సమీపంలో ఆందోళన చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం దాడులు పాశవికం ప్రముఖ పాత్రికేయులు పాలగుమ్మి సాయినాథ్ పేర్కొన్నారు. ఆదివారం కొరటాల భవన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ - జాషువా - పూలే - పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ అధ్యక్షతన జరిగిన నార్ల వెంకటేశ్వర రావు పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా సాయినాథ్ మాట్లాడుతూ అన్నదాతలపై ప్రభుత్వం డ్రోన్లు, వైమానిక దాడులు చేయడం అత్యంత పాశవికమన్నారు. ప్రస్తుత కేంద్ర పాలకులు సమాజాన్ని మత, కుల పరంగా విభజిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో

గంజాయి విక్రేతలు ?

చేబ్రోలు, ఫిబ్రవరి18: గంజాయి విక్రేతలను పోలీసులు అదుపులోకి తీసుకొన్ని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. శనివారం రాత్రి పొన్నూరు పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు చేబ్రోలు సమీపంలో కాల్వ గట్టు వద్ద అనుమానస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొన్ని ప్రశ్నించిన్నట్లు సమాచారం. పోలీసుల విచారణలో యువకులు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలియటంతో ఇద్దరు యువకులను పోలీసులు తమదైన శైలిలో విచారిస్తున్నారు. ఈ యువకుల వద్ద సుమారు 2 కిలోల గంజాయి పట్టుబడిన్నట్లుగా విశ్వసనీయంగా అందిన సమాచారం.